
# ప్రజా తపన

prajathapana.com

News that matters

అజ్ఞానులకు వెలుగు చూపండి, విద్యావంతులకు మరింత వెలుగు చూపండి. ఆధునిక విద్య పెంచే అహంకారానికి అంతులేకుండా పోతుంది.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 8 మంగళవారం 14 ఫిబ్రవరి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# భారత్ నుంచి 75 దేశాలకు రక్షణ పరికరాలు

**ఏరో ఇండియా ప్రదర్శనలో ప్రధాని నరేంద్ర మోడీ**

**బెంగుళూరు :**

ఏరో ఇండియా ప్రదర్శన భారత్? సామర్థ్యాలను ప్రతిబింబిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. విదేశాలకు రక్షణ రంగ సామగ్రి ఎగుమతి చేసే దేశంగా భారత్ మారిందని ఆయన అన్నారు. బెంగళూరు శివారు యలహంకలో ఏరో ఇండియా-2023 ప్రదర్శనను ప్రారంభించిన మోడీ వైమానిక దళం ప్రదర్శించిన విన్యాసాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. విదేశాలకు రక్షణ రంగ సామగ్రి ఎగుమతి చేసే దేశంగా భారత్? మారిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. రక్షణ రంగంలో ఇండియా బలోపేతమైందని చెప్పారు. కర్ణాటకలోని బెంగళూరు శివారు యలహంకలో ఏరో ఇండియా-2023 ప్రదర్శనను నరేంద్ర మోడీ సోమవారం ప్రారంభించారు. అనంతరం భారత వైమానిక దళం ప్రదర్శించిన విన్యాసాలను ఆయన ఆసక్తిగా తిలకించారు.

ఏరో ఇండియా ప్రదర్శన : భారత్? కొత్త బలం, సామర్థ్యాలను ప్రతిబింబిస్తుంది. ఏరో ఇండియా ఒక ప్రదర్శన మాత్రమే కాదు. భారత్? ఆత్మవిశ్వాసానికి ప్రతిబింబం. కేంద్ర బడ్జెట్?లో రక్షణ రంగ వస్తువుల తయారీ పరిశ్రమలకు పెద్ద పీట వేశాం.




పరిశ్రమలకు ఇచ్చే అనుమలు సరళతరం చేశాం. రక్షణ రంగంలో భారత్? బలోపేతమైంది. తక్కువ ఖర్చుతోనే రక్షణ పరికరాలు తయారు చేసుకుంటున్నాం. దశాబ్దాల పాటు ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణపరికరాల దిగుమతిదారుగా ఉన్న భారత్ ఇప్పుడు ప్రపంచంలోని 75 దేశాలకు రక్షణరంగ పరికరాలను ఎగుమతి చేస్తోంది. రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రైవేట్? సంస్థలను కోరుతున్నాను. ఈ రోజు దాదాపు 100 దేశాలు మన ప్రదర్శనలో పాల్గొంటున్నాయంటే భారత్‌పై ఈ ప్రపంచం ఎంత విశ్వాసంగా ఉందో స్పష్టమవుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు.



ద రన్ వే టు ఏ బిలియన్ ఆపర్చునిటీస్' పేరిట నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను ప్రారంభించేందుకు ప్రధాని ఆదివారం రాత్రి బెంగళూరుకు చేరుకున్నారు. ఏరో ఇండియా షో ఆసియాలో అతి పెద్ద వైమానిక ప్రదర్శనగా రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. 'భారత్‌లో తయారీ-ప్రపంచ కోసం తయారీ' అనే లక్ష్యాలతో రూపొందించిన భారతీయ రక్షణ రంగ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణ కానున్నాయన్నారు. 32 దేశాల రక్షణ మంత్రులు, 73 మంది వివిధ సంస్థల సీఈఓలు పాల్గొంటారని తెలిపారు. 17వరకు నిర్వహించే కార్యక్రమంలో రూ.75 వేల కోట్ల ఒప్పందాలు చేసుకోవడానికి వీలుందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు.

**ప్రత్యేకతలివే :**

యలహంక వైమానిక కేంద్రంలో 35 వేల చదరపు కిలోమీటర్లలో ప్రదర్శన వేదిక ఏర్పాటు. తొలిసారిగా ఐదు రోజుల పాటు వైమానిక ప్రదర్శన నిర్వహిస్తారు. రికార్డు ప్రకారం అత్యధిక సంఖ్యలో 98 దేశాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయి. 32 దేశాల రక్షణ మంత్రులు,

(మిగతా 2లో)

# తమిళ్ ఈలం చీఫ్ ప్రభాకరన్ బతికే ఉన్నాడు

**సంచలన విషయం బయటపెట్టిన ఇందిరాగాంధీ మాజీ సహాయకుడు పళ నెడుమారన్**

**న్యూఢిల్లీ :**

లిబరేషన్ ఆఫ్ తిమిళ్ ఈలం చీఫ్ వేలుపిళ్లై ప్రభాకరన్ బతికే ఉన్నాడంటూ కాంగ్రెస్ మాజీ నేత, ఇందిరాగాంధీ మాజీ సహాయకుడు పళ నెడుమారన్ సోమవారంనాడు సంచలన విషయం బయటపెట్టారు. ప్రభాకరన్ సజీవంగా, సురక్షితంగా, మంచి ఆరోగ్యంతో ఉన్నారని ప్రకటించారు. అయితే ప్రస్తుతం ప్రభాకరన్ ఎక్కడ ఉన్నాడనే విషయాన్ని ఆయన బయట పెట్టలేదు. త్వరలోనే ప్రభాకరన్

(మిగతా 2లో)



# ఆఫ్ఘానిస్థాన్ లో భూకంపం

**ఫైజాబాద్ :**

ఆఫ్ఘానిస్థాన్ దేశంలో సోమవారం ఉదయం భూకంపం సంభవించింది. ఆఫ్ఘానిస్థాన్ దేశంలోని ఫైజాబాద్ నగరానికి ఆగ్నేయంగా 100 కిలోమీటర్ల దూరంలో భూ ప్రకంపనలు సంభవించాయి. ఈ భూకంప ప్రభావం రిక్టర్ స్కేలుపై 4.3గా నమోదైంది. సోమవారం ఉదయం 6.47 గంటలకు ఫైజాబాద్ సమీపంలో 135 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ తెలిపింది. ఈ భూకంపం వల్ల ఎలాంటి



ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు నివేదికలు అందలేదు. సిరియా, టర్కీ భారీ భూకంపం తర్వాత ప్రపంచవ్యాప్తంగా భూమి కంపిస్తే చాలు ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. వేలాదిమందిని పొట్టనబెట్టుకున్న సిరియా, టర్కీ భూకంపం విషాద ఘటన మరవక ముందే మళ్లీ ఆఫ్ఘానిస్థాన్, భారత దేశాల్లో భూప్రకంపనలు సంభవించాయి.

# గవర్నర్ తో భేటీ అయిన సిఎం జగన్

గవర్నర్ గా రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడిన సిఎం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, భారతీ రెడ్డి దంపతులు సోమవారం రాజ్ భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసారు. గవర్నర్ హరిచందన్ ఆంధ్రప్రదేశ్ నుండి చత్తీస్ ఘడ్ గవర్నర్ గా బదిలీ అయిన నేపధ్యంలో వీరి భేటీ జరిగింది. ఈ సందర్భంగా బిశ్వభూషణ్ హరిచందన్ తో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ గవర్నర్ గా అందించిన సేవలను గుర్తుంచుకుంటారన్నారు. మచ్చలేని వ్యక్తిత్వంతో, కరోనా విపత్కర పరిస్థితు లను అధిగమించి, రాష్ట్రం ప్రగతి పథంలో పయనించడానికి ఎంతో సహకారాన్ని అందించారన్నారు. అధికార కార్య కాలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, నిండైన హుందా తనంతొ వ్యవహరించారని, అత్యుత్తమ రాజకీయ పరిణితి చూపి రాష్ట్ర ప్రజల హృదయాలను గెలుచుకున్నారని గవర్నర్ తో సిఎం అన్నారు. గవర్నర్‌గా రాష్ట్రానికి అందిం చిన సేవలను కొనియాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమ న్వయం సాధించి, మంచి సంబంధాలు సజావుగా సాగడంలో కీలక భూమిక పోషిం చారని, రాజ్యాంగానికి వన్నె తెచ్చారని సిఎం అన్నారు. ఆత్మీయతను



తెలుగు ప్రజలకు పంచారని, రాష్ట్రం నుంచి వెళ్లవలసి రావటం బాధాకరమైనా, దేశంలోని మరో రాష్ట్రానికి గవర్నర్‌గా వెళ్లడం ద్వారా అక్కడి ప్రజలకు మేలు చేయగలుతారని ప్రస్తుతించారు. తొలుత రాజ్ భవన్ కు చేరుకున్న ముఖ్యమంత్రికి గవర్నర్ సంయుక్త కార్యదర్శి సూర్య ప్రకాష్, ఉపకార్యదర్శి నారాయణ స్వామి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఛైర్మన్ మల్లాది విష్ణు, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి రేవు ముత్యాల రాజు, ఎన్ టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, నగర పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా, ఉప కమిషనర్ విశాల్ గున్ని, రాష్ట్ర ప్రోటోకాల్ డైరెక్టర్ బాల సుబ్రమణ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సినీ ‘హాస్యనట చక్రవర్తి’ రాజబాబు



## -నేడు ఆయన వర్ధంతి

తెలుగు సినీ ‘హాస్యనట చక్రవర్తి’ రాజబాబు కు వారి తల్లిదండ్రులు పెట్టిన పేరు అప్పలరాజు. సినిమా రంగంలో ‘రాజబాబు ‘ గా మారి అలాగే స్థిరపడిపోయారు. తన దైన హాస్యశైలి సినిమారంగానికి అందించారు. ఇంకా సుదీర్ఘ సినిమా యాత్ర చేయవలసి ఉండింది. అయితే, క్యాన్సర్ తో ఆయన 45ఏళ్ళ ప్రాయంలోనే మరణించారు.రాజబాబు చివరి క్షణాలు సొంత సినిమా విషాద సన్నివేశమొకటి నడిచొచ్చినట్లుంటుంది. ఆసుపత్రిలో ఉదయమే తెల్లచొక్కా వేసుకున్నాడు. అన్నివేళ్లకి ఉంగరాలు ధరించాడు. పక్కనే ఉన్న అమ్మకి, ‘నేను బాగున్నాను. మళ్లీ సినిమాల్లోకి వెళ్తాను. నువ ఇంటికి వెళ్లమ్మా,’ అని పేపర్ మీద రాసి చూపించాడు. ఆమె ధైర్యంగా ఇంటికి వెళ్లింది. అర గంటలోనే రాజబాబు చనిపోయినట్లు సమాచారం వచ్చింది.కష్టాలు సుఖాలు ఆయన్ని వెంటాడుతూ వచ్చాయి. మద్రాసు టి నగర్ లో ఒక చోట ఎపుడో ఒక రోజున ఐదు రుపాయల సాయం కోసం గంటల తరబడి నిలబడ్డాడు. సినిమాల్లో విజయవంతమయిన తర్వాత, ఖరీదైన కారులో ఆదారిన వెళ్లూ ఆచోటును చూపించి ఆవేదనం చెందేవాడని చెబుతారు.రాజబాబును నటనలో అనుకరించడం చాలా కష్టం. ఆయన హావభావాలు అనితరం సాధ్యం. మాటతీరు, బాడీ లాంగ్వేజీ గొప్పగా ఉంటాయి. అవెవరికీ కాపీ కాదు. ఆయనకు ఇన్ స్పిరేషన్ రేలంగి అని చెబుతారు. రేలంగి,రమణారెడ్డి, రాజబాబులు తెలుగు హాస్య నటత్రయం. ద్వంద్వార్థాల డైలాగులతో, కించపరిచే విధంగా కాకుండా ఈ ముగ్గరు నటనలో హాస్యం పండించిన వారు. వాళ్ల కాలం తెలుగు చలన చిత్రహాస్యానికి స్వర్ణయుగం. రాజమండ్రిలో పుణ్యమూర్తుల ఉమామహేశ్వర రావు , రమణమ్మ దంపతులకు రాజబాబు 1937 అక్టోబర్ 20వ తేదీన జన్మించారు. ఇంటర్ మీడియట్ తర్వాత టీచర్ ట్రైనింగ్ కూడా పూర్తిచేసి, తెలుగు టీచర్ గా ఉద్యోగంలో చేరారు. హైస్కూలు రోజుల్లోనే ఆయన నాటకాల్లో నటించే వారు. బుర్రకథ కూడా చెప్పేవారు.బుర్రకథని నిడదవోలు అచ్యుత రామయ్య దగ్గిర నేర్చుకున్నారు. తెలుగుటీచర్ గా పనిచేస్తున్నా నటుడిగా ఆయన జీవిస్తూ వచ్చారు.కుక్కపిల్ల దాక్కుంది , నాలుగిళ్ళ చావడి , అల్లూరి సీతారామరాజు నాటకాల్లో రాజబాబు వేసిన పాత్రలు , నటనా ప్రతిభ చూసిన డాక్టర్ గరికపాటి రాజారావు ఆయనను 1960లో మద్రాస్ కు ఆహ్వానించారు.దర్శకుడు అద్దాల నారాయణరావు తీసిన ‘సమాజం ‘ చిత్రంలో హాస్య నటుడి పాత్ర పోషించే అవకాశం దొరికింది. ఈచిత్రంలో హాస్య బ్రహ్మ రేలంగి కూడా నటించారు. తొలిప్రయత్నం విజయవంతంకాలేదు. అయినా సరే రాజబాబు నిరుత్సాహపడలేదు. తర్వాత ఆకాశరామన్న, కులగోత్రాలు చిత్రాలలో నటించాడు. వాటికి కూడా గుర్తింపు రాలేదు.తర్వాత ‘తోటలో పిల్ల , కోటలో రాణి’ (1964 నవంబర్ 22) చిత్రంలో మంచి అవకాశం వచ్చింది. దర్శకుడు జివి విశ్వనాథం ఇందులో వాణిశ్రీ సరసన నటించే అవకాశం కల్పించారు. ఈ చిత్రం రాజబాబు జీవితాన్ని కొత్తమలుపు తప్పింది.సుమారు 20 సంవత్సరాల పాటు చిత్ర రంగంలో ఉన్నారు. 589 చిత్రాల్లో నటించారు. అనేక మంది నటీమణులతో ఆయన నటించినా, రమా ప్రభతో ఆయన కాంబినేషన్ సూపర్ హిట్టయింది. చాలా సినిమాలను ఈ జంటకోసం తీసేవారు. సినిమా కొనేవాళ్లు, రాజబాబు రమా ప్రభ ఇందులో ఉన్నారాఅని అడిగే వారట. ఆరోజుల్లో అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీ రామరావులకు ఎంత డిమాండ్ ఉండిందో అంతే డిమాండ్ రాజబాబుకు ఉండింది. పెద్ద పెద్ద నిర్మాతలు కూడా ఆయన కాల్ షీట్స్ కోసం ఎదరుచేసే వారు. హాస్యనటుల్లో ఎవరూ తీసుకోనంత ఎక్కువగారెమ్యూనరేషన్ తీసుకునే వారు. ముందు రాజబాబు బుక్ చేసుకున్న తర్వాతే హీరోలతో నిర్మాతలు డేట్స్ ఖరారుచేసుకునేవారు. ఆరోజులలో హీరోలకి కూడా రాజబాబు భోరసా.బాబ్ అండ్ బాబ్ ప్రొడక్షన్స్ పతాకం పై ‘ఎవరికీ వారే యమునా తీరే ‘, మనిషి రోడ్డున పడ్డాడు ‘ వంటి చిత్రాలు నిర్మించి హీరోగా వేసారు. ఈ సినిమాలను ఎందుకు తీశాడో తెలుసా? తనకిష్టమయిన పాత్రలు సృష్టించుకుని నటించేందుకు ఈ చిత్రాలు తీశాడు. ఇవి ఫెయిలయినపుడు‘ఫెయిలయింది నా చిత్రాలు గాని, నా టాలెంట్ కాదు,’ అని ధీమా చెప్పిన వాడు రాజబాబు.అయితే పేర్లకు తగ్గట్టుగానే సొంత సినీమాలు దెబ్బతీసాయి. ఎవరు చిరంజీవులు అనే పేరుతో ఒక సినిమా తీయాలనుకున్నారు. అది కార్యరూపం దాల్చే లోపే మృత్యువు ఆయనను కభళించింది. ఆయన మద్యపానానికి బాగా బానిస అయ్యారు.దీ ని వల్లే క్యాన్సర్ వచ్చిందని చెబుతారు. తల్లితండ్రులను హైదరాబాద్ కు మార్చి, తాను హైదరాబాద్, మద్రాసుల మధ్య తిరుగుతూ వచ్చాడు.అందుకే ఆయన క్యాన్సర్ చికిత్స హైదరాబాద్ లో జరిగింది.గొంతుక్యాన్సర్ తో గొంతు పోయింది, చెప్పాలనుకున్నది కాగితం మీద రాసి చెప్పేపరిస్థితి వచ్చింది.చివర హైదరాబాద్ లోని మదర్ థెరీసా ఆసుపత్రిలో చేర్చారు. అక్కడే 1983 ఫిబ్రవరి 14న ఆయన చనిపోయారు. తాతామనవడు చిత్రంలో నట దిగ్గజం ఎస్వీ రంగారావు , అంజలీ దేవి మనవడి పాత్రలో రాజబాబు నటన హైలెట్. ఇల్లు ? ఇల్లాలు చిత్రంలో రాజబాబు ? రమాప్రభ జంట పై చిత్రించిన ‘ వినరా సూరమ్మ కూతురు మొగుడా ‘ పాట తెలుగునాట ఓ ఊపు ఊపేసి, చిరస్మరణీయం గా నిలిచింది.భీష్మ , చిట్టి తమ్ముడు , నవరాత్రి , పరమానందయ్య శిష్యుల కథ, గూడచారి 116, సాక్షి , బందిపోటు దొంగలు , బంగారు పిచ్చుక , రాజబాబు , ఏకలవ్య, కోడలు దిద్దిన కాపురం , ప్రేమనగర్ , జీవన జ్యోతి , ఇలా 589 సినిమాల్లో రాజబాబు నటించారు. బెస్ట్ కమెడియన్ గా 8 నంది అవార్డులు,16 ఫిలిం ఫేర్ అవార్డులు పొందారు. ఇందులో 13 వరసవచ్చాయి.రాజబాబు, లక్ష్మీ అమ్ములు దంపతులకు నాగేంద్రబాబు , మహేష్ బాబు సంతానం. లక్ష్మీ అమ్ములు మహాకవి శ్రీశ్రీ మరదలు. రాజబాబు సోదరులు చిట్టిబాబు , అనంత్ సినీమాల్లో , టివి సీరియల్స్ లో రాణిస్తున్నారు.రాజబాబు సినీమాల్లో సంపాదించడంతో పాటూ దానధర్మాలు కొదవలేకుండా చేసారు. పెద్ద పెద్ద హీరోలే చేయని దాతృత్వం ఆయనిది. రాజమండ్రిలో ఇప్పుడు వై జంక్షన్ గా పిలిచే ప్రాంతంలో తహసిల్దార్ క్వార్టర్ ని ఆనుకుని ఉన్న స్థలంలో పారిశుద్ధ్య కార్మికులకు ఇళ్ళు కట్టించి ఇచ్చారు. ఎంతో మంది సొంత ఖర్చుతో చదివించాడు.ఎందరికో పెళ్లిళ్లు చేశాడు.కోరుకొండలో జూనియర్ కాలేజి నిర్మాణానికి భూరి విరాళమిచ్చి, ఎందరో పేద విద్యార్థులు చదువుకోడానికి బాట వేశారు. ఈ కాలేజీని డిగ్రీ కాలేజీగా మార్చాలని ఆయన గలగన్నారు. అయితే అది నెరవేరకుండానే చనిపోయారు. తన పుట్టిన రోజు అక్టోబర్ 20 న అనేక మంది ప్రముఖులను సన్మానించేవారు.

# భారత్ నుంచి 75 దేశాలకు రక్షణ పరికరాలు

(మొదటిపేజీ తరువాయి)

29 దేశాల వైమానిక చీఫ్‌లు, 73 సంస్థల సీఈఓలతో సమావేశాలు నిర్వహిస్తారు. 809 రక్షణ, వైమానిక రంగ ప్రదర్శనకారులు పాల్గొనటం ఇదే తొలిసారి. వీటిల్లో ఎంఎస్ఎంఈ, అంకురాలున్నాయి. భారతీయ రక్షణ, వైమానిక రంగ సంస్థల ఆత్మనిర్భర్ ఉత్పత్తులతో ఇండియన్ పెవిలియన్, రక్ష మంత్రి, రక్ష రాజ్య మంత్రి, చీఫ్ డిఫెన్స్ స్టాఫ్, కార్యదర్శులతో ద్వైపాక్షిక సమావేశాలు, నివృత్త సైనికులతో సమావేశాలు, కర్ణాటక పెవిలియన్‌లు ఈ ప్రదర్శనలో నిర్వహిస్తారు.



### స్వదేశీ ఉత్పత్తులకు పెద్ద పీట

గత ఐదేళ్లుగా భారతీయ రక్షణ రంగానికి అవసరమైన ఉత్పత్తుల్లో 75 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైనవే. ఆత్మనిర్భర్ నిధులతో రక్షణ రంగం సాధించిన ప్రగతి వేదిక ద్వారా ప్రపంచ స్థాయి రక్షణ ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఆత్మనిర్భర్ ఉత్పత్తులు ప్రపంచ అతి పెద్ద ఆర్థికత ఉన్న మూడు దేశాల్లో చోటు సాధించేందుకు ఉపయోగపడతాయి. ఈ ఉత్పత్తులను ఆత్మనిర్భర్ వేదిక ద్వారా వీక్షించే వీలుంది. ఇండియన్ పెవిలియన్ ద్వారా 115 సంస్థల 227 ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. అందులో ఎల్ఆర్‌యూ, ఎల్‌సీఏ-తేజాస్, ఎఫ్‌సీఎస్, డిజిటల్ ఫ్లై బై, మల్టీ రోల్ సూపర్ సానిక్ ఫైటర్, ప్రభుత్వ, ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో తయారైన ఉత్పత్తులు ప్రదర్శిస్తారు.

# తమిళ్ ఈలం చీఫ్ ప్రభాకరన్ బతికే ఉన్నాడు

(మొదటిపేజీ తరువాయి)

జనం ముందుకు వస్తారని మాత్రం వెల్లడించారు. ప్రభాకరన్ కుటుంబం కూడా సురక్షితంగా ఉందని, తాను వారితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నానని అన్నారు. ప్రభాకరన్ కుటుంబ సభ్యుల అనుమతి తీసుకున్న తర్వాతే ఈ విషయాలను తాను బయట పెడుతున్నట్టు చెప్పారు. శ్రీలంకలోని ప్రస్తుత పరిస్థితిని ప్రస్తావిస్తూ, ఈలమైట్స్‌లో విశ్వాసాన్ని ప్రభాకరన్ కల్పించనున్నారని అన్నారు.
”తమిళ జాతీయ నేత ప్రభాకరన్ గురించిన నిజం తెలియజేయదలచుకున్నాను. ఆయన చాలా బాగున్నారు. ఈ విషయాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలందరికీ తెలియజేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఇంతవరకూ ఆయన గురించి ఒక పద్ధతి ప్రకారం వ్యాప్తి చేసిన ఊహాగానాలకు ఈ వార్తతో తెరపడుతుందని ఆశిస్తున్నాను” అని నెడుమారన్ తెలిపారు. ప్రభాకరన్ సరైన సమయంలో జనం ముందుకు వస్తారని, ప్రస్తుతం ఆయన ఎక్కడున్నారనేది చెప్పడం కష్టమని అన్నారు..
”ప్రభాకరన్ ఎక్కడున్నారు? ఆయన ఎప్పుడు వస్తారు? ప్రపంచం తమిళులు తెలుసుకోవాలని ఆసక్తిగా ఉన్నారు. తమిళ ఈళం గురించి సమగ్ర ప్రణాళికను ప్రభాకరన్ త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రభాకరన్ కుటుంబ సభ్యులతో టచ్‌లో ఉన్నాను. అందువల్లే వారి అనుమతితో ఈ విషయాన్ని చెబుతున్నాను. ఆయన సరైన సమయంలో కనిపిస్తారు. ప్రస్తుతం ఆయన ఎక్కడున్నారనేది చెప్పడం మాత్రం కష్టం” అని నెడుమారన్ తెలిపారు.

### ఎవరీ టైగర్ ప్రభాకరన్..?

శ్రీలంకలో తమిళుల హక్కుల కోసం లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్‌టీటీఈ)ను వేలుపిల్లై ప్రభాకరన్ 1976లో స్థాపించాడు. సింహళుల ఆధిపత్య శ్రీలంక ప్రభుత్వం, సింహళ పౌరులు తమపై విపక్ష చూపుతున్నారంటూ తమిళులకు స్వయంప్రతిపత్తి కోసం ఎల్‌టీటీఈ పిలుపునిచ్చింది. క్రమంగా అది గెరిల్లా పోరాటంగా మారింది. 1983లో జాఫ్నా వెలుపల శ్రీలంక సైన్యం పెట్రోలింగ్‌పై గెరిల్లా దాడి జరగడంతో 13 మంది సైనికులు మరణించారు. దీంతో ఎల్‌టీటీఐపై ఉగ్రవాద ముద్ర సంస్థగా శ్రీలకం ప్రభుత్వం ప్రకటించింది. ఇది అంతర్యుద్ధంగా మారడంతో 90వ దశకంలో శ్రీలంక సింహాళీయులకూ, మైనార్టీ తమిళులకు మధ్య భీకర పోరాటమే సాగింది. అప్పట్లో తగినంత బలం, బలగం ఎల్టీటీఈకి తక్కువగానే ఉన్నా విదేశాల నుంచి అందిన సాయంతో సింహాళీయులకు ప్రబాకరన్ చుక్కలు చూపించారు. ఎట్టకేలకు ప్రభాకరన్ 2009లో ఆర్మీ మట్టుపెట్టింది. తాము జరిపిన దాడుల్లో ప్రభాకరన్ ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభాకరన్ మృతదేహం ఫోటోలను కూడా లంక ఆర్మీ విడుదలచేసింది. దీంతో లంకలో తమిళ పోరు ముగిసినట్లయింది. ఈ నేపథ్యంలో వేలుపిళ్లై ప్రభాకరన్ ఇంకా బతికే ఉన్నట్లు పళనెడుమారన్ సంచలన ప్రకటన చేశారు.

# భూత వాహనంపై శ్రీ కామాక్షి సమేత సోమస్కందమూర్తి

**తిరుపతి**



తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజైన సోమవారం ఉదయం శ్రీ సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారి సమేతంగా భూత వాహనంపై అభయ మిచ్చారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. పూర్వం క్రూరభూతాలు ప్రజలను బాధిస్తున్న వేళ పరమశివుని బ్రహ్మదేవుడు ఆ భూతాల నుంచి లోకాలను కాపాడమని వేడుకున్నారు. ఈ కార్యానికి నిర్జన ప్రదేశాలైన శ్మశానాలను తన ఆస్థానాలుగా చేసుకున్నాడు శివుడు. భూతాలను వశీకరించి శ్మశానాలలో ఉంచి బ్రహ్మసృష్టిని రక్షిస్తున్నాడని, నాటి నుండి “భూతపతి”గా కీర్తించే జీవులకు భయాలను తొలగించి శివుడు రక్షిస్తున్నాడని భక్తుల విశ్వాసం. అందుకు ప్రతీకగా లయకారుడు భూతవాహనంపై అభయమిచ్చారు. అనంతరం ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం ఘనంగా జరిగింది. శ్రీ సోమస్కందమూర్తి, శ్రీకామాక్షి దేవి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ పార్థ సారధి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్స్ పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

**మూడు లక్షలు ఆస్తి నష్టం**

**కట్టు బట్టలతో కుటుంబ సభ్యులు**

**కొత్తపేట**



కోనసీమ జిల్లా కొత్తపేట నియోజక వర్గం ఆలమూరు మండలం మడికి గ్రామంలో గల జిల్లా పరిషత్ రోడ్డు ప్రక్కన గల జాస్తి బాబురావు, ఇందిర దంపతులకు చెందిన ఇల్లు ప్రమాదాస్తు నిప్పు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మండపేట అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలు పక్క గృహాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. సమాచారం అందుకున్న మండల డిప్యూటీ తాసిల్దార్ ఆర్ జానకి రాఘవ వీఆర్వో టి సూర్యప్రకాశరావు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని మూడు లక్షలు రూపాయలు ఆస్తి నష్టం కలిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. కాగా మంటల్లో చిక్కుకున్న జాస్తి ఇందిరకు తీవ్ర గాయాలవడంతో ఆమెను స్థానికులు హుటాహుటిన రాజ మహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఇంటిలోనికి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఇంట్లో గల అన్ని ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు వంట సామాగ్రి, దుస్తులు పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు.

# ఎమ్మెల్సీ కోసం ఆశావహుల ప్రయత్నాలు

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్సీపీ నేతలకు పదవుల పండుగ వచ్చింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఖాళీ అవుతున్న 8 స్థానాలు వైసీపీ ఖాతాలోనే పడే అవకాశాలు ఉన్నాయి. మరో ఐదు ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలకు సంబంధించి ఇప్పటికే బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలతోపాటు స్థానిక సంస్థల కోటాలో 8 స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో అధికార వైసీపీ స్థానిక సంస్థలపై ప్రత్యేక దృష్టి సారించింది. సామాజికవర్గాల వారీగా పార్టీకి విధేయతగా పనిచేసిన వారికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని ఇప్పటికే సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో 2017లో స్థానిక సంస్థలకు సంబంధించి 8 శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం మార్చి 29 తేదీతో వారి పదవీ కాలం ముగియనుంది. దీంతో నెల్లూరు జిల్లాకు సంబంధించి వాకాటి నారాయణ రెడ్డి , అనంతపురం నుండి గుణపాటి దీపక్ రెడ్డి , కడప నుండి బీటెక్ రవి పై మూడు స్థానాలకు సంబంధించి మార్చి 29వ తేదీతో పదవీ కాలం ముగియనుంది. అలాగే, పశ్చిమ గోదావరి జిల్లా నుండి ఎం వెంకట సత్యనారాయణ, తూర్పు గోదావరి నుండి చిక్కాల రామచంద్రరావు, శ్రీకాకుళం నుండి శత్రుచర్ల విజయరామ రాజు, చిత్తూరు నుండి బీఎస్ నరసింహులు (దొరబాబు), కర్నూలు నుండి కేఈ ప్రభాకర్ తెలుగుదేశం పార్టీకి చెందిన పై ఐదు మంది ఎమ్మెల్సీల పదవీకాలం మే 1తో ముగియనుంది. అయితే, పై 8 స్థానాలకు మార్చి 13వ తేదీ ఎన్నికలు జరగబోతున్నాయి. అన్ని చోట్లా వైఎస్ఆర్సీపీకి పూర్తి స్థాయిలో బలం ఉంది. అధికార వైసీపీ ఎమ్మెల్సీ టిక్కెట్లు ఆశించేవారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశించి అధిష్టానం ఆదేశాల మేరకు పోటీ నుండి తప్పుకుని అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేసిన పలువురు సీనియర్ నేతలుసైతం ఎమ్మెల్సీ టిక్కెట్లు ఆశిస్తున్నారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వీరి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. గతంలో హామీ ఇచ్చిన నేతల పేర్లతోపాటు తాజాగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న మరికొంత మంది నేతల పేర్లను పరిశీలిస్తున్నారు. 8 జిల్లాల్లో సామాజికవర్గాల వారీగా అభ్యర్థులను ఖరారుచేసే దిశగా సీఎం జగన్ అడుగులు వేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో రెడ్డి సామాజికవర్గం నుండి ఎమ్మెల్సీ టిక్కెట్ ఆశించేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో ఆయా జిల్లాల్లో ఖాళీ అవుతున్న స్థానాల్లో ఆసామాజికవర్గానికి చెందిన పార్టీ విధేయులకు అవకాశం కల్పించి ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో ఇతర సామాజికవర్గాలకు ప్రాధాన్యత కల్పించేలా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి 13 జిల్లాల్లో దాదాపుగా 90 శాతం పైగా వైసీపీ మద్దతు దారులే స్థానిక సంస్థల్లో విజయం సాధించారు. పంచాయతీలతోపాటు మండల పరిషత్‌లు జిల్లా పరిషత్‌లు అధికార వైసీపీనే సొంతం చేసుకుంది. మార్చి 13న జరగనున్న స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి అధికార పార్టీ నుండి టిక్కెట్లు ఆశించేవారి సంఖ్య రోజురోజుకూ మరింత పెరుగుతోంది. అయితే ఈ సారి ఎమ్మెల్యే రేసులో ఉన్న వారికి టిక్కెట్లు ఇవ్వలేని వారు ఉంటే వారికి ఎమ్మెల్సీ టిక్కెట్లు ఇవ్వాలన్న ఆలోచన సీఎం జగన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. త్వరలోనే అభ్యర్థుల్ని ఖరారు చేయనున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు ఆరెంజ్ అలెర్ట్.....

**విశాఖపట్టణం:**

దక్షిణ బంగాళాఖాతంలో, శ్రీలంకకు దిగువన బలమైన మేఘాలు, తేమ గాలులు కేంద్రీక్రుతం అయ్యాయి. వీటివల్ల తెలుగు రాష్ట్రాలపై ఎలాంటి ప్రత్యేక ప్రభావం పడబోదని వాతావరణ నిపుణులు తెలిపారు. ఉత్తర భారతం నుంచి వస్తున్న పొడి గాలుల ప్రభావంతో తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం లేదని తెలిపారు. ఉత్తర వాయువ్య దిశ నుంచి వస్తున్న పొడిగాలుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని అంచనా వేశారు. వచ్చే మూడు రోజులు రాత్రి వేళ ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు పగటిపూట వేడి పెరుగుతుందని అంచనా వేశారు..ఆంధ్రప్రదేశ్ వాతావరణ విభాగం తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపోస్పిరిక్ స్థాయిల్లో ఈశాన్య, తూర్పు దిశలలో గాలులు వీస్తున్నాయని వెదర్ బులెటిన్ లో పేర్కొన్నారు. ఈ వాతావరణ పరిస్థితుల వల్ల ఏపీలోని ఉత్తర కోస్తా ఆంధ్ర, యానాం ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు పొడి వాతావరణమే ఉంటుందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటనలో తెలిపింది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ లో కూడా పొడి వాతావరణమే ఉండనుంది. రాయలసీమలో వచ్చే మూడు రోజులు పొడి వాతావరణమే ఉండనుంది.'రాష్ట్రంలో వాతావరణం మళ్లీ మారనుంది. ఇక మెల్లగా చలి కాలం నుంచి ఎండా కాలానికి మార నుంది. సాధారణంగా ఫిబ్రవరి మొదటి రెండు వారాల్లో అంతగా ఎండ ఉండదు, కానీ ఈ సారి మాత్రం వేసవి కాలం కాస్త ముందుగా, మరింత జోరుగా మొదలవ్వనుంది. మరో ఐదు రోజుల వ్యవధిలో ఉష్ణోగ్రతలు 4-5 డిగ్రీలు రాష్ట్ర వ్యాప్తంగా పెరగనుంది. అనంతపురం నుంచి నెల్లూరు మధ్యలో, నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు ఉష్ణోగ్రతలు ఒక సారిగా వేడికానుంది. ఇప్పుడే 40 డిగ్రీలు రావు కానీ 37 డిగ్రీల వరకు పలు ప్రాంతాల్లో నమోదవ్వనుంది. ముఖ్యంగా విజయవాడ - గుంటూరు ప్రాంతం, అలాగే నంధ్యాల జిల్లాలో రాష్ట్రంలోని మిగిలిన భాగాలకంటే వేడిగా ఉండనుంది. మరోవైపున చలి కూడా ఉంటుంది. రాత్రి వేళల్లో చల్లగా ఉండే వాతావరణం ఉంటుంది." అని ఏపీ వెదర్ మ్యాన్ తెలిపారు.

# కొత్త గవర్నర్ నజీర్ సంగతులు

**విజయవాడ :**

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ని ఏపీ గవర్నర్ గా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు 4 ఏళ్ల పాటు సర్వోన్నత న్యాయస్థానం జడ్జిగా సేవలు అందించిన జస్టిస్ అబ్దుల్ నజీర్ పలు కీలక తీర్పులు వెలువరించారు. ఇందులో మార్పులతో పాటు కొత్త నియామకాలు ఉన్నాయి. నలుగురు బీజేపీ నేతలు సహా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్... కొత్తగా గవర్నర్లుగా నియమితులైన వారిలో ఉన్నారు. జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గా నియమితులయ్యారు. ప్రస్తుత గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ను ఛతీస్ ఘడ్ గవర్నర్ గా నియమించారు. వీరితో పాటు పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లతో పాటు పలువురిని బదిలీ చేశారు.ఆంధ్రప్రదేశ్ కి మూడో గవర్నర్ గా రానున్న ఎస్ అబ్దుల్ నజీర్.. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించి.. ఈ ఏడాది జనవరి 4న పదవీ విరమణ పొందారు. 1958 జనవరి 5న అప్పటి మైసూర్ రాష్ట్రం ( ప్రస్తుతం కర్ణాటక) బెలువాయిలో జన్మించిన ఆయన... ముడిబిద్రిలోని మహావీర్ కళాశాలలో బీకాం గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. మంగళూరులోని కొడియాల్ బైల్ లోని ఎస్డీఎమ్ కళాశాల నుంచి ఎల్ఎల్బీ పట్టా అందుకున్నారు. 1983లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించికర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి స్థాయికి చేరుకున్నారు. కర్ణాటక హైకోర్టులో సేవలు అందిస్తుండగానే పదోన్నతి పొంది, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ గా చేయకుండానే.. దేశ సరోన్నత న్యాయస్థానానికి న్యాయమూర్తిగా ఎంపికైన మూడో జడ్జగా గుర్తింపు పొందారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2017, ఫిబ్రవరి 17 నుంచి 2023 జనవరి 4 వరకు సేవలు అందించారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా దాదాపు



నాలుగేళ్లు సేవలు అందించిన జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్... పలు కీలక తీర్పులు వెల్లడించారు. ఆయోధ్య - బాబ్రీ మసీదు ట్రిపుల్ తలాక్ నోట్ల రద్దు గోప్యత హక్కు వంటి కీలక కేసుల్లో తీర్పు వెలువరించిన ధర్మాసనంలో ఆయన ఒకరు. 2019లో ఆయోధ్య వివాదంపై చారిత్రాత్మక తీర్పు వెలువరించిన ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు బెంచ్ లో. జస్టిస్ అబ్దుల్ నజీర్ కూడా ఒకరు. ధర్మాసనంలోని అయిదు గురు న్యాయమూర్తులు ఆయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి అనుకూలంగా తీర్పునిచ్చారు. రిటైర్మెంట్ కి రెండు రోజుల ముందు నోట్ల రద్దుపై జస్టిస్ అబ్దుల్ నజీర్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. దేశంలో పెద్ద నోట్లు రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 2016 నవంబర్ 8న ఇచ్చిన నోటిఫికేషన్ ని ఈ బెంచ్ సమర్థించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లోపభూయిష్టంగా లేదని పేర్కొంది. అనంతరం... జనవరి 4న పదవీ విరమణ చేసిన జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పేరుని గవర్నర్ పదవికి కేంద్రం సిఫారసు చేయగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఏపీ గవర్నర్ గా నియమిస్తున్నట్లు పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేశారు.మరోవైపు... రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ని గవర్నర్ గా నియమించడంపై... విపక్ష కాంగ్రెస్ కేంద్ర సర్కార్ పై విమర్శలు గుప్పించింది. మోదీ కోసం పనిచేసిన వారికి గవర్నర్ గిరీ ఇస్తున్నారని దుయ్యబట్టింది. మోదీ అదాని కోసం పనిచేస్తున్నారని.మోదీ కోసం పనిచేసిన వారు గవర్నర్లు అవుతున్నారని విమర్శిస్తూ... కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ ట్వీట్ చేశారు. మరి ప్రజల కోసం ఎవరు పనిచేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయరామ్ రమేశ్... 2012లో అరుణ్ జైట్లీ మాట్లాడుతున్నట్లుగా ఉన్న వీడియోను షేర్ చేశారు. "పదవీ విరమణ తర్వాతి హోదాలు.. పదవిలో ఉన్నప్పుడు ఇచ్చే తీర్పులని ప్రభావితం చేస్తాయి" అని జైట్లీ చెబుతున్నట్లుగా ఆ వీడియోలో ఉంది కాంగ్రెస్ నుంచి వస్తోన్న విమర్శలను.. బీజేపీ ఖండించింది. శ్రీ రామ జన్మభూమి వివాదంపై తీర్పు వెలువరించడమే జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన పాపంగా.. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు పరిగణిస్తున్నాయని... అందుకే గవర్నర్ గా ఆయన నియామకాన్ని తప్పుపడుతున్నాయని బీజేపీ సంస్థాగత కార్యదర్శి బీఎల్ సంతోష్ అన్నారు.

# అచ్చెన్న ఇమేజ్ పెంచుకోవడం ఎలా

**శ్రీకాకుళం :**

టీడీపీలో ప్రస్తుతం చర్చంతా ఆ లీడర్ గురించే. పార్టీ వ్యవహారాల్లో కీలకంగా ఉన్న ఆ నాయకుడి వల్లే.. ఇమేజ్ డ్యామేజ్ అవుతోందన్న చర్చ నడుస్తోందట. ఇది అనుకోకుండా జరుగుతోందా.. లేక కావాలని చేస్తున్నారా అనేది అంతు చిక్కడం లేదట. ఇంతకీ టీడీపీలో చర్చగా మారిన ఆ నేత ఎవరు? ఆయనేం చేస్తున్నారు?అచ్చెన్నాయుడు. టీడీపీ ఏపీ అధ్యక్షుడు. పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత టీడీపీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీలో అత్యంత కీలక వ్యక్తుల్లో ఒకరిగా ఉన్నారు. పార్టీ తీసుకునే నిర్ణయాల్లో అచ్చెన్న పాత్ర లేకుండా ఏదీ జరగదనే భావన దాదాపుగా ఏర్పడింది. అయితే తక్కువ టైమ్‌లోనే కీలక పొజిషన్‌కు ఎలా చేరారో.. అంతేస్థాయిలో విమర్శలు కూడా ఎదుర్కొంటున్నారు అచ్చెన్నాయుడు.గతంలో టీడీపీ గురించి ఓ లీడర్‌తో అచ్చెన్న కామెంట్ చేసింది మొదలు.. వివిధ సందర్భాల్లో ప్రత్యర్థి పార్టీలకు.. సోషల్ మీడియాకు ఈజీగా దొరికిపోతున్నారనే చర్చ సాగుతోంది. ఒకటికి రెండు సందర్భాల్లో టీడీపీపై అచ్చెన్న చేసిన కామెంట్స్ పార్టీని ఇరుకున పెట్టాయి కూడా. తన పేరు లేకుండానే ప్రెస్‌నోట్ ఇచ్చేశారని అసెంబ్లీ కమిటీకి సమాధానం ఇచ్చారు. ఇటీవల పాదయాత్రలో పోలీసులను ఉద్దేశించిన వ్యాఖ్యలు.. ఒకటి రెండు సందర్భాల్లో అధికారంలోకి వచ్చినా అధినేతను నమ్మలేం అంటూ చేసిన కామెంట్స్ కలకలం రేపాయి. తాజాగా పార్టీ నేత చేస్తున్న పాదయాత్రకు చిత్తూరు పట్టణంలో లభించిన ఆదరణపై టీడీపీలోనే చర్చ ఉంది. దాని మీద పార్టీ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. ఆ



విషయాన్ని బయటకు పొక్కకుండా చాలా జాగ్రత్తలు పడింది టీడీపీ అధిష్ఠానం.అచ్చెన్న కారణంగా చిత్తూరు వ్యవహారం కూడా బయటకు వచ్చిందని టీడీపీలో లేటెస్ట్ టాక్. ఏపీ టీడీపీ చీఫ్ హోదాలో ఆయన నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. పాదయాత్ర ఫెయిల్యూర్ బాటలో ఉందన్న వైసీపీ విమర్శలకు మరింత బలం చేకూరేలా అచ్చెన్న టెలికాన్ఫరెన్స్ నిర్వహించారనేది ఆ చర్చ సారాంశం. ఆ టెలికాన్ఫరెన్స్ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో పాదయాత్రలో పాల్గొంటున్న నేతతోపాటు పార్టీ ఇమేజ్ కూడా డ్యామేజ్ అయిందనే వాదన వినిపిస్తోందట. పార్టీ అధినాయకత్వం నిర్వహిస్తున్న టెలీకాన్ఫరెన్సులు లీక్ కాకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ అచ్చెన్న టెలికాన్ఫరెన్స్ ఆడియో క్లిప్ ఎలా బయటకు వచ్చిందనేది ప్రశ్న. ఇది బయట వ్యక్తుల పనా.. లేక ఇంటి దొంగల కుట్ర అని ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అచ్చెన్న వ్యవహార శైలి.. గతంలో బయటకొచ్చిన ఆయన ఆడియో.. వీడియో క్లిప్పులు.. ఆయన చేసిన కామెంట్స్ ఏ విధంగా వైరల్ అయ్యాయో ప్రస్తావిస్తూ.. వాటికీ వీటికి ఏదైనా లింక్ ఉందా అని ప్రశ్నిస్తున్నారట.

# హైదరాబాద్ లో మరో నకిలీ బాబా

**హైదరాబాద్ :**

ఓ యువతికి దెయ్యం పట్టిందని నమ్మించిన దొంగ బాబా, పెళ్లి చేసుకుని రక్షించుకుంటానని చెప్పి మోసం చేశాడు. యువతి ఫిర్యాదుతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ లో యువతి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు అయింది. హైదరాబాద్ టోలిచౌక్‌కు చెందిన ఓ యువతి నెల్లూరులోని ఓ దర్గాకు చెందిన హాఫీజ్ పాషా వద్దకు చికిత్స కోసం వెళ్లింది. యువతికి దెయ్యం పట్టిందని నమ్మించిన బాబా, ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోలేదని కుటుంబ సభ్యులను నమ్మించాడు. మూడేళ్లుగా యువతికి చికిత్స చేస్తున్నా నయంకాలేదు. కొన్ని రోజుల్లో యువతి చనిపోతుందని కుటుంబ సభ్యులను నమ్మించిన బాబా.. పెళ్లి చేసుకుని యువతి ప్రాణాలు కాపాడుకుంటానని నమ్మించాడు. దీంతో ఆమె బంధువులు బాబాతో పెళ్లికి ఒప్పుకున్నారు. బాబాతో పెళ్లికి యువతి కుటుంబ సభ్యులు ఏర్పాటుచేశారు. ఈనెల 11న హైదరాబాద్ టోలిచౌక్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ పెళ్లి చేసుకుంటానని చెప్పిన బాబా ముఖం చాటేశాడు. అనుమానంతో యువతి బంధువులు బాబా బంధువుల సంప్రదించగా హెల్త్ బాగోలేదని చెప్పించాడు. బాబా ప్రవర్తనపై అనుమానం వచ్చిన యువతి కుటుంబ సభ్యులు ఆరా తీయగా గతంలోనే అతడు అనేక మందిని పెళ్లి చేసుకున్నట్టు అసలు విషయం తెలిసింది. ఈ దొంగ బాబాపై నెల్లూరులోని పలు పోలీస్ స్టేషన్లలో 13 కేసులు నమోదు అయ్యాయని తెలిసింది. దీంతో బాధితురాలి ఫిర్యాదుతో హాఫీజ్ పాషాపై లంగర్ హౌస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే ఆ బాబా ఏడు పెళ్లిళ్లు జరిగినట్టు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ నగర్ లో ఇటీవల దొంగ బాబా హల్ చల్ చేశాడు. మాయ మాటలు చెప్తూ ఇంట్లోకి వచ్చిన ఆ బాబా.. సదరు మహిళపై పసుపు, కుంకుమలు చల్లాడు. దీంతో మహిళ స్పృహ తప్పింది. ఈ క్రమంలోనే అతను చెప్పినట్లు నడుచుకుంది. మెడలో ఉన్న బంగారు చైన్ ను ఇచ్చేసింది. ఆ తర్వాత బాబా మెల్లగా అక్కడి నుంచి ఉడాయించాడు. హైదరాబాద్ ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఇంద్రప్రస్థ కాలనీలో వరలక్ష్మి, రాము దంపతులు నివసిస్తున్నారు. రాము ఓ చిన్నపాటి వ్యాపారి. కాషాయ దుస్తులు ధరించిన బాబా వరలక్ష్మి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆమెతో మాటలు కలుపుతూ పసుపు, కుంకుమలు చల్లాడు. దీంతో వరలక్ష్మి బాబా చెప్పినట్లు ఆడింది తన మెడలో ఉన్న గొలుసు తీసి బాబాకు ఇచ్చింది. గొలుసు తీసుకున్న బాబా మెల్లగా బయటకు వెళ్లిపోయాడు. ఇదంతా జరుగుతున్నా ఆమెకు ఏమీ తెలియలేదు. వరలక్ష్మిపై మత్తమందు చల్లిన బాబా బురిడీ కొట్టించాడు. వరుసగా పక్కనే ఉన్న రెండిళ్లలోకి కూడా బాబా వెళ్లాడు. కానీ అక్కడ ఎవరూ దొంగ బాబా చేతిలో మోసపోలేదు. సకాలంలో మహిళ భర్త రావడంతో బాబా అక్కడి నుంచి జారుకున్నాడు. ఇదంతా సీసీ కమెరాల్లో రికార్డు అయింది. అయితే సదరు మహిళ స్పృహలోకి రాగానే తన మెడలో ఉన్న చైన్ కనిపించట్లేదని చెప్పింది. వెంటనే వాళ్లు సీసీ టీవీ చెక్ చేశారు. జరిగినదంతా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు నేరాలను తగ్గించేందుకు ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు. కాగా బురిడీ బాబాను ఎల్బీ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంద్ర ప్రసతా కాలనీలో మహిళ మెడలో నుంచి మంగళ సూత్రాన్ని లాక్కెళ్లిన బురిడీ బాబాను నందనవనంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# మళ్లీ ప్రజా దర్బార్

**హైదరాబాద్ :**

రాజ్‌భవన్, ప్రగతిభవన్ మధ్య సయోధ్య కుదిరిందని అనుకుంటున్న తరుణంలో కొత్త చర్చ మొదలైందా? రాజ్‌భవన్ దర్బార్‌లపై పొలిటికల్ సర్కిళ్లలో చర్చ జరుగుతోందా? రాష్ట్ర సర్కార్ రియాక్షన్ ఏంటి?తెలంగాణకు గవర్నర్‌గా వచ్చినప్పటి నుంచి నిత్యం ఏదో ఒక కార్యక్రమంలో బిజీగా ఉంటున్నారు తమిళిసై. అందులో కొన్ని కార్యక్రమాలు రాష్ట్ర సర్కార్‌కు కంటగింపుగా మారడంతో రాజ్‌భవన్, ప్రగతి భవన్ మధ్య గ్యాప్ వచ్చింది. రెండు రాజ్యాంగ వ్యవస్థలు చర్చల్లో నలిగాయి. రిపబ్లిక్ డే వేడుకల నిర్వహణ, బడ్జెట సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఏర్పాటు చేయడంతో రెండు వ్యవస్థల మధ్య వాతావరణం తేలికపడింది. రాజకీయ ఘర్షణకు ఫుల్‌స్టాప్ పడిందని రాజకీయ వర్గాలు భావించాయి. అయితే ఈ మార్పు మూణ్ణాళ్ల ముచ్చటేనా అని అధికారపార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోందట. దీనికి రాజ్‌భవన్‌లో జరుగుతున్న దర్బార్‌లను వాళ్లు కారణంగా ప్రస్తావిస్తున్నారట.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాజ్‌భవన్‌లో చర్చాగోష్టిలు నిర్వహిస్తున్నారు గవర్నర్ తమిళిసై. ఈ సమావేశాలే చర్చగా మారుతున్నాయి. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర సర్కార్ పెదవి విరిచింది. రాష్ట్రానికి మళ్లీ మొండి చెయ్యే ఇచ్చారనేది గులాబీ నేతల ఆగ్రహం. అయితే అదే కేంద్ర బడ్జెట్‌పై రాజ్‌భవన్‌లో నిర్వహిస్తున్న దర్బార్‌లే గులాబీ శిబిరంలో గుసగుసలకు వేదికయ్యాయి. కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్ర సర్కార్ విమర్శిస్తే.. ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను అభినందించారు గవర్నర్. కేంద్ర చిట్టాపద్దును ఫ్యూచరిస్టిక్ బడ్జెట్‌గా ప్రశంసించారు కూడా. ఆ తర్వాత వరస సమా వేశాలు పెడుతున్నారు తమిళిసై.కేంద్ర బడ్జెట్ 2023-24లో ఆరోగ్యరంగానికి కేటాయింపులు.. ఇచ్చిన ప్రాధాన్యాలపై గవర్నర్ అధ్యక్షతనే సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న వైద్య నిపుణులు పాల్గొన్నారు. హెల్త్‌కేర్‌కు భారీ కేటాయింపులు చేయడం వల్ల దేశంలో సుస్థిరమైన ఆరోగ్యం సంరక్షణ సాధ్యమనేది గవర్నర్ తమిళిసై అభిప్రాయం. విద్యా, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి ఇచ్చిన కేటాయింపులపైనా చర్చాగోష్టి నిర్వహించారు. రాజ్‌భవన్‌లో గతంలో ఈ విధమైన కార్యక్రమాలు జరగకపోవడంతో గులాబీ నేతలు అటెన్షన్‌లోకి వచ్చారు. రాజ్‌భవన్, ప్రగతిభవన్ మధ్య సామరస్య వాతావరణం నెలకొందని అనుకుంటున్న తరుణంలో తాజా దర్బార్‌లు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో

## జన్మభూమి ఎక్స్ ప్రెస్ లో లేడి టీటీఈ రుబాబు

**విశాఖపట్నం**

జన్మభూమి ఎక్స్ ప్రెస్ లో టీటీఈ ప్రతిభా భారతి ప్రయాణికుల పై తిట్లదండంకం ఎత్తుకుంది. హైద్రాబాద్ నుండి విశాఖ కు వచ్చే జన్మభూమి ఏక్స్ ప్రెస్ లో ఘటన చోటు చేసుకుంది. జన్మభూమి ఎక్స్ ప్రెస్స్ రద్దీగా ఉండటంతో కొంత మంది ప్రయాణికులు అనుకోకుండా ఎసి కంపార్టమెంట్ ఎక్కారు. ఎసి కంపార్టమెంట్ ఎక్కి నెక్ట్ స్టేషన్ లో జనరల్ బోగికి వెళ్ళతామని ఆ ప్రయాణికులు అన్నారు. అయినా వినిపించుకోకుండా రన్నింగ్ ట్రైన్ లో దాడి చేసిన టీటీడీ కొంత మందిని రన్నింగ్ లోనే తొసివేసే ప్రయత్నం చేసింది. మరికొంత మందికి రిసిప్ట్ లేకుండా భారీ పైన్లు విధించింది. మరికొంత మంది పై దాడి చేసింది. ఈ నేపధ్యంలో విశాఖ రైల్వే స్టేషన్ లో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. టీటీఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. జిఆర్పి పోలీసులకు పిర్యాదు చేసారు.

## చౌటపల్లిలో క్షుద్ర పూజలు..

**విజయవాడ**

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం చౌటపల్లి గ్రామంలోఆదివారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు కలకలం రేపాయి. టేకులపల్లి-చౌటపల్లి గ్రామాల సరిహద్దుల్లో లంకెబిందెలు ఉన్నాయని క్షుద్రపూజలు జరిపినట్లు సమాచారం. గుప్తనిధుల కోసం వచ్చిన పూజరుల వెంట ఒక చిన్న బాలుడు ఉండటంతో నరబలి ఇవ్వడానికే తెచ్చారని గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది మంది సభ్యులు గుప్తనిధుల కొరకు వచ్చారు. వీరంతా బుగ్గపాడు, తిరువూరు, ఏరుకోపాడు, టేకులపల్లి వాసులు వచ్చినవారిలో నలుగురు పరారు అయ్యారు. మరో నలుగుర్ని గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

## తోటచర్ల నేషనల్ హైవేపై ఉద్రిక్తత

**జగ్గయ్యపేట**

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం తోటచర్ల నేషనల్ హైవేపై ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మార్పిఎస్ నేత మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నేషనల్ హైవే నిర్బంధం చేసారు. విజయవాడ , హైదరాబాద్ మీద కీసర,తోటచర్ల నేషనల్ జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. హైవే పై ఎమ్మార్పీ ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఏసీఈ నాగేశ్వర్ రెడ్డి పోలీసులు బలగాలతో అక్కడికి చేరుకున్నారు. అందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులపై రాళ్ల దాడికి దిగారు. రాళ్లదాడిలో నందిగామ ట్రాఫిక్ కానిస్టేబుల్ తిరుమలరావు తలకు బలమైన గాయం తగిలింది. వెంటనే నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలువరు అందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాళ్లదాడితో కోపానికి గురైన పోలీసులు తోటచర్ల వద్ద కనపడ్డ వారిని అదుపులోకి తీసుకున్నారు. పలువురు అనుమానితుల్ని, తోటచర్ల గ్రామంలో నివాసముంటున్న వారిని గృహాల్లోకి ప్రవేశించి అదుపులోకి తీసుకున్నారు.

## అయ్యన్న వెలమ కుల ద్రోహి

**విశాఖపట్నం**

టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుపై టీడీపీ రెబెల్ నేత ఈర్లె శ్రీరామ్మూర్తి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయ్యన్నపాత్రుడు కులం కోసం బతికే నేత కాదని... కులం మీద బతికే వ్యక్తి అని విమర్శించారు. ఆయన వెలమ కులద్రోహి అని మండిపడ్డారు. రాజకీయంగా తనను ఎదగనీయడం లేదని, అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ ఉద్యోగానికి 2018లో తాను రాజీనామా చేశానని... అప్పటి నుంచి టీడీపీకి సేవలందిస్తున్నానని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ ఇస్తానని తనకు గతంలో హామీ ఇచ్చిన చంద్రబాబు మాట తప్పారని అన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానానికి శ్రీరామ్మూర్తి పోటీ పడుతున్న విషయం గమనార్హం.
మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుతో సన్నిహితంగా ఉండటం వల్లే అయ్యన్నపాత్రుడు తనపై కక్ష సాధిస్తున్నారని శ్రీరామ్మూర్తి అన్నారు. ఇండిపెండెంట్ గా నామినేషన్ వేసినా తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఉపాధ్యాయ సంఘాలు, పట్టభద్రులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. అయ్యన్నది ఉత్తరాంధ్ర కాదని... ఆయనది కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని అల్లిపూడి గ్రామం అని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని వలస నేతలు పాలిస్తున్నారని చెప్పే అర్హత అయ్యన్నకు లేదని చెప్పారు.

## సాగర తీరం ప్రక్షాళన ప్రారంభం

**విశాఖపట్నం**

సముద్ర తీరంలో సహజసి ద్ధమైన ప్రకృతి వనరుల పరిరక్షణలో కీలకమైన డ్రిజ్జింగ్ ప్రక్రియ ప్రారంభమైం ది.కోతకు గురి కాకుండా ఉండేలా అధి కారులు డ్రిజ్జింగ్ పనులకు శ్రీకారం చుట్టారు.విశాఖ పోర్ట్ అథారిటీ ఆధ్వర్యం లో డ్రెజ్జింగ్ కార్పోరేషన్ ఇండియా కోతకు గురైన సముద్ర తీర ప్రాంతాన్ని ప్రక్షాళన చేసేందుకు సామాజిక భాద్య తతో ముందుకు వచ్చింది.సీఎస్ఆర్ ఫండ్ 20కోట్ల వ్యయంతో 30 రోజులలో పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూ పొందించుకుంది.ఆర్కెబీచ్ సమీపంలో డీసీఐ పనులను విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ రామమోహన్ రావు లాంఛనం గా ప్రారంభించారు.ప్రకృతి వనరులకు సంబంధించి సమతుల్యత అవసరమ న్నారు. చుట్టూ వున్న పరిసరాలను ఎప్పటికప్పుడే మనవంతు బాధ్యతగా కాపాడుకోవాలన్నారు.

# వివాదాలకు కేంద్రంగా పానకాల స్వామి

**గుంటూరు :**

మంగళగిరిలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం. ఇప్పుడు ఈ ఆలయం వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. దక్షిణ భారతదేశంలోనే అతి పురాతన దేవాలయంగా మరియు లక్ష్మీ నరసింహ క్షేత్రాలలో ఒకటిగా ఉన్న ఈ దేవాలయం ప్రస్తుతం రాజకీయాలకు వేదికగా మారింది, మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాల యానికి ఆనుకొని ఉన్న పెద్ద కోనేరు ఇప్పుడు హాట్ టాపిక్ గా వార్తల్లో ఉంది. ఈ కోనేరు నుండి నీటిని తీసుకొని స్వామివారికి నిత్యం అభిషేకం చేయడం కోసం పాండవుల కాలంలో ఈ కోనేటిని నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. అయితే ఈ కోనేరు పునర్నిర్మాణం కొరకు వైసీపీ ప్రభుత్వం కోటిన్నర రూపాయలు వెచ్చించి మరమ్మత్తులు నిర్వహిస్తుంది, కడపకు చెందిన ఓ కాంట్రాక్టర్ దీని మరమత్తులు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే నిత్యం ఈ కోనేరు వద్ద సంచరిస్తున్నారని, కాంట్రాక్టర్ స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి బినామీ అని, నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా నీటిని తోడి, పూడిక తీయాలని నిర్ణయించి ఆ పనులు జరుగుతుండగా, కోనేటి అడుగు భాగంలో గుప్త నిధులు ఉన్నాయని ఒక వర్గం చెబుతుంది. అయితే ఇంత పురాతన కోనేటిని మరమ్మతులు చేసేటప్పుడు సీసీటీవీ తో భద్రత కల్పించి ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ పర్యవేక్షణలో మరియు నిపుణుల పర్యవేక్షణలో మరమ్మతులు నిర్వహిస్తే పారదర్శకంగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి స్థానిక ఎమ్మెల్యేని అధికారులని డిమాండ్ చేస్తుంది. అయితే ఈ డిమాండ్ ను ఎవరు పట్టించుకోలేదు దాంతో నేడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తెలుగుదేశం పార్టీ నేతలకు ఉన్న మరియు భక్తులు అనుమానాలను టిడిపి నేతలు వెల్లడించారు.అయితే తమ ఆరోపణలకు సమాధానం ఇవ్వడం లేదని పనులు పారదర్శకంగా జరగడంలేదని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పై టిడిపి సీనియర్ నేత పోతినేని శ్రీనివాస్, తమ్మిశెట్టి జానకి దేవి లు మండిపడ్డారు. ఎంతో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనంసింహస్వామి ఆలయం పునర్నిర్మాణం లో తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదని పలు అనుమానాలకు తావిచ్చే విధంగా అధికారుల తీరు ఉందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా అధికారులు స్పందించి భక్తుల మనోభావాలను గౌరవించాలని పలు ధార్మిక సంస్థలు కూడా కోరుతున్నాయి. అయితే ప్రశ్నించిన వారి గొంతు నొక్కే విధానంలో కేసులు పెడతారని భయంతో కొంతమంది భక్తులు బహిరంగంగా వ్యాఖ్యానించడానికి భయపడుతూ విమర్శలు చేయడం కనపడుతుంది.

# మెగా ఫోన్ పట్టుకోబోతున్న మంత్రి

**హైదరాబాద్ :**

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఇప్పుడు తన దృష్టిని టాలీవుడ్‌పై ఫోకస్ చేశారు. సినిమా నిర్మాతగా ఆమె కొత్త అవతారం ఎత్తబొతున్నారు. ఇందు కోసం ఇప్పటికే హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతంలో మంత్రి విడదల రజిని కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సినిమాలపై ఆసక్తితోనే ఆమె ఈ రంగంలోకి అడుగు పెడుతున్నట్లు ఫిల్మ్ నగర్ తో పాటు, వైసీపీలో కూడా చెప్పుకుంటున్నారు. రజనీ నిర్మాలగా తొలి సినిమాకు కథ కూడా సిద్ధమైందని అంటున్నారు. చిత్ర దర్శకుడు, హీరో ఇత్యాది విషయాలపై త్వరలోనే ఒక స్పష్టత వస్తుందని చెబుతున్నారు. సినిమా భారీ బడ్జెట్ తోనే విడదల రజని నిర్మించబోయే సినిమా తెరకెక్కబోతోందని ఫిలింనగర్ వర్గాలు చెబుతున్నాయి. 2014 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ తరఫున ప్రచారం కోసం.. యూఎస్ నుంచి ఎన్నారైల బృందం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది. వారిలో విడదల రజనీ కూడా ఒకరు. అలా ఆ ఎన్నికల్లో రజని తెలుగుదేశం పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం చేశారు. 2017లో విశాఖపట్నంలో నిర్వహించిన మహానాడు వేదికపై నుంచి తెలుగుదేశం అధినేత, అప్పటి సీఎం చంద్రబాబు నాయుడిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆ తర్వాత 2018లో వైసీపీలో చేరి... 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. జగన్ మలి కేబినెట్‌లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా విడదల రజినీ బాద్యతలు చేపట్టారు. అయితే తొలిసారి ఇలా ఎమ్మెల్యే అయి.. అలా మంత్రి పదవి చేపట్టి విడదల రజినీ.. వార్తల్లో నిలిచారు. తాజాగా ఆమె.. అడుగులు పాలిటిక్స్ నుంచి సినిమా రంగం వైపు పడుతుండటం ఆసక్తి కలిగిస్తోంది. జగన్ పార్టీలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు టాలీవుడ్‌లోని నటీనటులు, దర్శక, నిర్మాతలతో స్నేహ సంబంధాలు, బంధుత్వాలు ఉన్న సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ సోదరుడు నర్సీపట్నం ఎమ్మెల్యే పి. ఉమా శంకర్ గణేశ్, మరో దర్శకుడు కురసాల కళ్యాణ కృష్ణ సోదరుడు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఇక చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పలు చిత్రాల్లో నటించారు. విశాఖ ఎంపీ సత్యనారాయణ సైతం.. పలు చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించడమే కాకుండా.. నటిస్తున్నారు కూడా. నగరి ఎమ్మెల్యే, మంత్రి రోజా.. సినీమారంగం నుంచే రాజకీయాలలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక రాజమండ్రి ఎంపీ మారగాని భరత్ కూడా సినిమాలో నటించారు. అలాగే ప్రముఖ మాటల రచయిత కోన వెంకట్ సమీప బంధువు కోన రఘుపతి బాపట్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక ప్రముఖ నటుడు అలీ, పోసాని కృష్ణమురళీ ఉండనే ఉన్నారు. అలాగే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని నిర్మాతగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో మంత్రి విడదల రజినీ చేరారు.

# ఆన్ లైన్ జోగులాంబ అమ్మవారి ఆలయ సేవలు

### వెబ్ సైట్ ను ఆవిష్కరించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

**హైదరాబాద్ :**

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో దశలవారీగా ఆన్లైన్ సేవలను విస్తరిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం అరణ్య భవన్ లో జోగులాంబ అమ్మవారి ఆలయ వెబ్ సైట్ ను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆవిష్కరించి, ఆన్ లైన్ సేవలను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు వారి సౌకర్యార్థం ఇప్పటికే 36 ప్రధాన ఆలయాల్లో ఆన్ లైన్ లో పూజలు, వసతి బుకింగ్, ప్రసాదం పంపిణీ, తదితర ఆన్లైన్ సేవలను భక్తులకు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. దీని వల్ల భక్తులు అనేక సేవలను పారదర్శకంగా, సులభంగా పొందగలుగుతున్నారని వివరించారు. దశల వారీగా ఆన్ లైన్ సేవలను విస్తరిస్తున్నామని, అందులో భాగంగానే జోగులాంబ అమ్మవారి ఆలయంలో ఆన్లైన్ సేవలను ఇవాళ ప్రారంభించు కున్నామన్నారు ఆన్లైన్ సేవలు అందు బాటు లోకి రావడంతో ఇకపై భక్తులు ఆన్లైన్ మోడ్ ద్వారా దర్శన టిక్కెట్లు, పూజలు, అర్చనలు, ఇతర సేవలను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కాగా, భక్తుల సేవలు ఆఫ్లైన్తో పాటు ఆన్లైన్లో కూడా కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు. అదే విధంగా కృష్ణ పుష్కరాల సమయంలో సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధి, వసతుల కల్పన కోసం నిధులు కేటాయిం చారని, ఇప్పటికే జోగులాంబ ఆలయాన్ని పునర్ నిర్మించామని, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడిం చారు. ప్రసాద్ స్కీం కింద కూడా ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆలంపూర్ ఎమ్మెల్యే ఎం. అబ్రహం, సిర్పూర్ కాగజ్ నగర్ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప, ఆలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, ఆలయ ఈవో పురెందర్ కుమార్, యూనియన్ బ్యాంక్ డిజిఎం రమణతదితరులు ఉన్నారు..

# కల్తీ లేని ఆహారాన్ని తినటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చు

**నారాయణ పేట**




కల్తీ లేని ఆహారాన్ని తినటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చునని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు ..సోమవారం ఉదయం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లొ అడ్వాంటా కంపెనీ వారి సహకారంతో జిల్లా అధికారులకు నాణ్యమైన కూరగాయల విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు ప్రతి కూరగాయ పంటకు పెస్టిసైడ్ లు పురుగు మందులు చల్లటం వల్ల వాటిని తింటున్న ప్రజలు ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. కొన్ని దీర్ఘ కాలిక వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సైతం వచ్చే ప్రమాదాలు ఉన్నాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరం పెస్టిసైడ్ లేని, పురుగుమందు వాడని కూరగాయలు మనకు దొరికిన కాస్త స్థలంలోనే పండించుకుని తినాలని సూచిం చారు. అదేవిధంగా రైతులు సైతం తాము పండించే పంటలుకు పెస్టిసైడ్ వాడకుండా సేంద్రియ ఎరువులను ఉపయోగించి సాధ్యమైనంత వరకు సేంద్రియ పురుగుమందులు వాడు తూ పంటలు, కూరగాయలు పండిం చాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు 12 రకాల కూరగా యల విత్తనాలను అందించారు. జిల్లా అధి కారులు తమ పెరటి లొ కూరగా యలు సహజ వ్యవసాయ విధానాల ద్వారా సాగు చేసి కాలుష్య రహిత ఆహార ఉత్పత్తి చేసి ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. రూ 39000/- విలువ చెసే 12 రకాల కూరగాయల కిట్ లను 100 మంది జిల్లా ఆధికారులకు అడ్వాంటా కంపెనీ సహకారము తో అందించారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ మయంక్ మిత్తల్, వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్ అధికారి గిరిధర్, జిల్లా అధికారులు మురళి, రాజ్ కుమార్, నరేందర్, యాదగిరి, ఎవో నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం నివాసానికి కూత వేటు దూరంలో అమానుషం

**అమరావతి**



తాడేపల్లి లని సీఎం నివాసానికి కూత వేటు దూరంలో అమానుషం జరిగింది. కంటి చూపు లేని ఎస్తేరు రాణి అనే 17 ఏళ్ల యువతిని రాజు అనే యువకుడు గంజాయి మత్తులో అతి కిరాతకంగా నరికి చంపాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతిపై అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం. రాజు ప్రవర్తనపై అమ్మకి పెద్దమ్మకి యువతి తెలియచేసింది. ఆమె రాజుని నిలదీసింది. నాకే పాపం తెలీదు రాణి నా చెల్లి లాంటిది అని నమ్మ పలికాడు. ఐదు నిమిషాల్లోనే విచక్షణ కోల్పోయి గంజాయి మత్తులో టెడ్డీబేర్ తో ఆడుకుంటున్న రాణిని అతి దారుణంగా తలపై అనేకమార్లు నరికాడు. రాణిని హుటాహుటిన ఆసుపత్రి తరలించిరనా ఆమె మృతి చెందింది.
నిందితుడిపై గతంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, మరో వివాహిత మీద గొడ్డలితో దాడి చేసిన ఘటనలు వున్నాయి. కళ్ళు కానరాని నా కూతుర్ని అతి దారుణంగా నరికి చంపిన కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. తాడేపల్లి పోలీసులు ఘటనా స్థలంలో మారణాయుధాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

## ఆన్ లైన్ లో నెహ్రూ జులాజికల్ పార్క్ సేవలు

**హైదరాబాద్**

హైదారాబాద్ కు తలమానికంగా ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కు కోసం ప్రత్యేకంగా ఓ వెబ్ సైట్, మొబైల్ యాప్ ను రూపొందించినట్లు అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. వెబ్ సైట్ లో సమస్త సమాచారాన్ని నిక్షిప్తం చేయడంతో పాటు సందర్శకులు సులువుగా జూ ఎంట్రీ టికెట్ బుకింగ్, బ్యాటరీ వెహికల్స్ ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.
సోమవారం అరణ్య భవన్ లో నెహ్రూ జూ పార్క్, కొత్త వెబ్ సైట్, మొబైల్ యాప్ ను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆవిష్కరించారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఈ వెబ్ సైట్ ను రూపొందించింది. ఈ కార్యక్రమంలో సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే, పీసీసీఎఫ్ ఢ హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్, అటవీ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంతి, జూ పార్క్ క్యురేటర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి మాస్టర్ ప్లాన్ పై హైకోర్టులో విచారణ

**హైదరాబాద్**

తెలంగాణ హైకోర్టులో సోమవారం నాడు కామారెడ్డి మాస్టర్ ప్లాన్ పై విచారణ జరిగింది. మాస్టర్ ప్లాన్ నిర్ణయాన్ని హోల్డ్ లో పెట్టామని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. కోర్టుకు తెలపకుండా మాస్టర్ ప్లాన్ పై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. సింగిల్ బెంచ్ లో ఉన్న మరో పిటిషన్ ను డివిజన్ బెంచ్ లో ఇంప్లీడ్ చేసింది. డివిజన్ బెంచ్ లో పార్టీ ఇన్ పర్సన్ గా ప్రజా శాంతి పార్టీ నేత కే ఏ పాల్ తన వాదనలు వినిపించారు. తదుపరి విచారణ ఏప్రిల్ 17 కు హైకోర్టు వాయిదా వేసింది.

## ఎమ్మెల్యే రఘునందన్ రావు పిటిషన్ పై విచారణ

**హైదరాబాద్**

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పిటిషన్ పై హైకోర్టులోసోమవారం విచారణ జరిగింది. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నిధులను దుబ్బాకకు కేటాయించక పోవడంపై అయన పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని రఘునందన్ రావు, తన పిటిషన్ లో పేర్కొన్నారు. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ ను కేవలం సిద్దిపేట , గజ్వేల్ కు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. న్నఅభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని పిటిషన్ లో ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, జీయేడీ ముఖ్యకార్యదర్శి , సిద్దిపేట , మెదక్ కలెక్టర్లు, ఆర్ అండ్ బీ అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## ఎమ్మెల్యే శంకర్ నాయక్ పర్యటన

**మహబూబాబాద్**

మహబూబాద్ నియోజకవర్గంలోనీ గూడూరు మండలంలో ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ సోమవారం పర్యటించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి పరామర్శించారు. గతంలో ఉప్పోజు జయమ్మ బావి లో పడి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు ఉప్పోజు వెంకటేశ్వర్లు, చొప్పదండి సాంబయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు చొప్పదండి రమా, అంగోతు కిరణ్ కరెంట్ షాక్ తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు అంగోతు కళ్యాణి, బి ఆర్ ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ ఒక్కొక్కరికి 2,00,000 రూపాయల చెక్కులను అందజేపారు. వారి కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని పార్టీ కోసం నిజాయితీగా పని చేయాలని అలాంటి వారికి భవిష్యత్తులో ఉన్నత పదవులు దక్కుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఢ గ్రామ భారాస నాయకులు, సర్పంచ్ లు, ఎంపిటిసిలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ అక్షరాల 720 రూపాయిలు

**లాహోర్ :**

అవును.. మీరు చదువుతోంది అక్షరాల నిజం. చికెన్ ధర ఆకాశాన్నంటింది. చరిత్రలో ఎన్నడూ లేనంతగా.. కిలో రూ.720కి చికెన్ ధర పెరిగింది. అయితే ఇది మన దేశంలో కాదు లెండి, పొరుగు దేశం పాకిస్తాన్‌లో. కరాచీలో కేజీ చికెన్ ధర రూ.720 ఉండగా.. ఇస్లామాబాద్, రావల్పిండి సహా ఇతర నగరాల్లో రూ.700-705 మధ్యలో ఉంది. అయితే.. లాహోర్‌లో మాత్రం రూ.550-600 మధ్య రేటు పలుకుతోంది. ఇంతలా అక్కడ చికెన్ రేట్లు పెరగడానికి కారణం.. ఆర్థిక సంక్షోభంతో పాటు పౌల్ట్రీ వ్యాపారాలు మూతపడటమేనని పాకిస్తాన్ మీడియా తెలుపుతోంది. కోళ్ల ఫీడ్‌కు తీవ్ర కొరత ఏర్పడిందని, అందుకే పౌల్ట్రీ వ్యాపారులు బిజినెస్ నిలిపివేశారని పేర్కొంటోంది. చరిత్రలో కనీవినీ ఎరుగుని స్థాయిలో పెరిగిన ఈ ధరలు చూసి.. చికెన్ ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ధరలు పెరగడంతో.. చికెన్‌ను తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్ ప్రభుత్వం రంగంలోకి దిగి.. ఈ చికెన్ ధరల సమస్యను పరిష్కించేందుకు ప్రయత్నిస్తోంది. కోళ్లకు అందించే ఫీడ్‌కు కొరత ఎందుకు ఏర్పడిం దనే విషయంపై విచారణ చేపట్టింది. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యని పరిష్కరించి, చికెన్ ధరల్ని తగ్గించి, ప్రజలకు ఊరటనిచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. కాగా పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థలో పౌల్ట్రీ పరిశ్రమ ఎంతో ముఖ్యమైంది. దాని సరఫరా గొలుసుకు అంతరాయాలు ఏర్పడితే.. దేశ ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పాక్ మీడియం చెప్తోంది. అందుకే, ఈ అంశంపై పాక్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలుస్తోంది. కేవలం పౌల్ట్రీ వ్యాపారాలు మూతపడటమే కాదు.. పాక్‌లో పెట్రోల్ కొరత కూడా ఏర్పడింది. చాలాచోట్ల పంపుల్లో పెట్రోల్ అయిపోయింది. దీంతో.. ప్రజల జీవితానికి అంతరాయం ఏర్పడింది. నెల రోజులకు పైగా పంపులకు సరఫరా లేకపోవ డంతో సుదూర ప్రాంతాల్లో పరిస్థితి భయం కరంగా ఉందని పాక్‌లోని డాన్ పత్రిక నివేదించింది. పేలవమైన ఆర్థిక వ్యవస్థ కారణంగా పంజాబ్‌లోని ప్రధాన, చిన్న నగరా ల్లోని అనేక పెట్రోల్ పంపులు మూసివేయ బడ్డాయని డాన్ పేర్కొంది .మరోవైపు.. ఐఎంఎఫ్ బెయిలౌట్ సాయంతో ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడొచ్చని భావించిన పాకిస్తాన్‌కి ఊహించని షాక్ తగిలింది. ఐఎంఎఫ్‌తో గత పది రోజుల నుంచి పాక్ ప్రభుత్వం జరుపుతున్న చర్చలు.. విఫలం అయినట్లు అక్కడి మీడియా చెబుతోంది. బెయిలౌట్ ప్యాకేజీపై అంతర్జాతీయ ద్రవ్యనిదితో ఒప్పందం చేసుకోవ డంలో పాకిస్తాన్ విఫలం అయినట్లు తెలుస్తోంది. దీనిపై పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. ఊహకు అందని విధంగా ఐఎంఎఫ్ షరతులు ఉన్నాయని, కానీ పాకిస్తాన్ వీటికి తలొగ్గాల్సిందేనని పేర్కొన్నారు. అయితే.. ఐఎంఎఫ్ షరతులకు అంగీకరిస్తే అక్కడి ప్రజలు మరింతగా సమస్యల్లో కూరుకుపోయే అవకాశం ఉందని తెలుస్తోంది. విద్యుత్ టారిఫ్ పెంచడం, పెట్రోల్ ధరలు పెంచడం, సబ్సిడీలను ఎత్తేయడం, పన్నులను పెంచడం వంటి షరతులను ఐఎంఎఫ్ విధిస్తోంది.

# ఏపి గవర్నర్ ఆకస్మికంగా మార్పు పై రాష్ట్రవ్యాప్తంగా చర్చ!

**అమరావతి :**

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను ఆకస్మికంగా మార్చి.. ఆయన స్థానంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను నియమించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 2019 జూలై 24న విశ్వభూషణ్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు జగన్ ప్రభుత్వంతో విభేదాలకు వెళ్లలేదు. ప్రభుత్వం నుంచి ఏ ఫైలు వచ్చినా దానిమీద పెద్దగా ప్రశ్నించేవారు కాదు. సర్కారుకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ పూర్తి సానుకూలత ప్రదర్శించారు. జగన్ ప్రభుత్వంతో గవర్నర్ పూర్తిస్థాయిలో మమేకమైనట్లు కేంద్రం కూడా గుర్తించింది. కొందరు ఢిల్లీ పెద్దలు ఈ వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. జగన్ ప్రభుత్వ అనాలోచిత విధానాలు, పోకడలను అడ్డుకోవాల్సిన ఆవశ్యకతను కేంద్రం గుర్తించిందా అన్న సందేహం తాజా నియామకం ద్వారా వ్యక్తమవుతోంది. ఇలాంటి దూకుడుకు చెక్‌పెట్టడానికే జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను గవర్నర్‌గా నియమించారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఎప్పుడూ వివాదాల జోలికిపోని జస్టిస్ అబ్దుల్ నజీర్ అవసరమైనప్పుడు చాలా గట్టిగా వ్యవహరిస్తారని, ఒత్తిళ్లకు లొంగరని న్యాయవర్గాలు అంటున్నాయి. ఈయన ద్వారా జగన్‌కు చెక్ పెట్టవచ్చని, మరీ అడ్డగోలుగా వ్యవహరించకుండా నిలువరించవచ్చనే ఆలోచనతోనే గవర్నర్‌గా



ఎంచుకున్నారని చెబుతున్నారు.జగన్ సర్కారు చట్టవ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నా.. మూడు రాజధానులు సహా అత్యంత వివాదాస్పదమైన చట్టాలు చేసినా మరో మాటకు ఆస్కారమివ్వకుండా గవర్నర్ విశ్వభూషణ్ ఆమోదముద్ర వేయడంపై ఢిల్లీ పెద్దలు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. దానికి తాజా ఘటనే ఉదాహరణగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. రాజధాని ఏర్పాటుకు సంబంధించి రాష్ట్రాలకు ఉన్న అధికారాలను పార్లమెంటులో ప్రస్తావించినప్పుడు.. ఆ ప్రశ్నతో నేరుగా సంబంధం లేకపోయినా.. జగన్‌రెడ్డి మూడు రాజధానుల చట్టంపై తమతో చర్చించలేదని, తమకు సమాచారం కూడా ఇవ్వలేదని కేంద్రం కొద్దిరోజుల కిందట ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఆ ప్రశ్న అడిగితే ఇలాంటి సమాధానం చెప్పడం సమంజసమే. కానీ ప్రశ్నతో సంబంధం లేకుండానే జవాబిచ్చిందని.. ఆ బిల్లు విషయంలో కేంద్రం జగన్ వైఖరి పట్ల అసహనంగా ఉన్నట్లు అర్థమవుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. మూడు రాజధానుల బిల్లును విశ్వభూషణ్ కళ్లుమూసుకుని ఆమోదించారన్న ఆరోపణలు మొదటి నుంచీ ఉన్నాయి. అనేక సందర్భాల్లో కోర్టుమెట్లెక్కిన అనేక బిల్లులను గవర్నర్ న్యాయపరిశీలన కోరకుండానే ఆమోదించారన్న రాజకీయ విమర్శలూ లేకపోలేదు. 'రాష్ట్రం ఏం చెప్పినా ఎస్ అంటున్నారు. ప్రభుత్వంలో, పాలనలో ఏదైనా తప్పు జరిగినప్పుడు గవర్నర్ ఎత్తిచూపించాలి. విధానపరమైన అంశాల్లో లోపాలు, ప్రతిపాదనల్లో తప్పులుంటే గవర్నర్ వెనక్కి తిప్పిపంపించాలి.తెలంగాణలో గవర్నర్ తమిళిసై అక్కడి ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తున్నారు. ఇక్కడ ఆ స్థాయిలో కాకున్నా.. ప్రభుత్వానికి ఏది తప్పో.. ఏది ఒప్పో గవర్నర్ చెప్పగలగాలి. కానీ ఎందుకో ఆయన ఈ విషయంలో మౌనమునిలా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏదొచ్చినా సంతకం పెట్టేస్తున్నారు' అని ఢిల్లీ పెద్దలు గుర్రుగా ఉన్నట్లు చెబుతున్నారు. కేంద్రం ఇప్పటికైతే జగన్‌రెడ్డి ప్రభుత్వంతో కొంత మేర సత్సంబంధాలనే కొనసాగిస్తోంది. కొన్ని విషయాల్లో మాత్రం ఆచితూచి అడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది. గత ఏడాది వరకు అడగడమే ఆలస్యం.. అదనపు అప్పులకు అనుమతి ఇచ్చేది. ఇప్పుడు కాస్త తగ్గించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై బీజేపీ నేతల స్వరం కూడా క్రమంగా మారుతూ వస్తోంది. కొందరు కేంద్ర మంత్రులు రాష్ట్ర పర్యటనకు వచ్చి జగన్ ప్రభుత్వ వైఖరిని, విధానాలను ఘాటుగానే విమర్శిస్తున్నారు.

# కొండగట్టుకు కేసీఆర్

**కరీంనగర్ :**

తెలంగాణలోని మరో ఆలయానికి మహర్దశ రాబోయే సమయం అసన్నమైంది. ఇప్పటికే యాదాద్రిని రాష్ట్రంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దింది తెలంగాణ సర్కార్. మాస్టర్ ప్లాన్ రూపొందించి... సమూల మార్పులు చేసింది. పనుల ప్రగతిని నిత్యం పర్యవేక్షించిన సీఎం కేసీఆర్... ఎప్పటికప్పుడూ సమీక్షలు, సూచనలు చేస్తూనే వచ్చారు. పలుమార్లు స్వయంగా యాదాద్రికి వెళ్లిన ఆయన... పనుల ప్రగతి పరిశీలించారు. అధికారులను పరుగులు పెట్టించారు. వాటన్నింటి ఫలితమే నేటి యాదాద్రి అన్నట్లు ఉంది. ఈ నేపథ్యంలో మరో ప్రముఖ ఆలయమైన కొండగట్టు అభివృద్ధి కేసీఆర్ దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది.ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్... జగిత్యాల జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకోనున్నారు. ఇదే సమయంలో ఆలయ అభివృద్ధికి సంబంధించిన పనులపై చర్చిస్తారని సమాచారం. యాదాద్రి ఆలయ ఆర్కిటెక్చర్ ఆనంద్ సాయి కూడా ఆదివారం కొండగట్టుకు వెళ్లనున్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ పై చర్చిస్తారని తెలుస్తోంది. ఈ ఆలయానికి సంబంధించిన ఆర్కిటెక్చర్ పనులను కూడా ఆనంద్ సాయికే అప్పగించే అవకాశం ఉంది. ఇప్పటికే కొండగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించిన సంగతి కూడా తెలిసిందే. దేవస్థానం అభివృద్ధికి రూ. 100కోట్ల నిధులు విడుదల చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ కొండగట్టు టూర్ ఖారారైనే నేపథ్యంలో... ఆలయానికి మహర్దశ రావటం ఖాయంగానే కనిపిస్తోంది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు పడే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది.మరోవైపు సీఎం కేసీఆర్ టూర్ నేపథ్యంలో జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయు కాలేజీలో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ భాస్కర్ హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. మిగత శాఖల అధికారులు కూడా ఏర్పాట్లల్లో నిమగ్నం అయ్యారు.

# మహిళలు బాడీ షేమింగ్ నుంచి బయటపడాలి..

### తెలంగాణ గవర్నర్ తమిళి సై పిలుపు

**హైదరాబాద్ :**

ప్రస్తుతం మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బాడీ షేమింగ్ .దీన్ని భరించలేకనేనేమో.. మహిళలంతా అందంపై దృష్టి సారిస్తున్నారు. బాడీ షేమింగ్ నుంచి బయటపడాలి.. మెరుగ్గా మారాలన్న తపనే ఎన్నో మానసిక ఆరోగ్య పరిస్థితులకు దారి తీస్తోంది. ఒక్కసారి సోషల్ మీడియా ను పరిశీలిస్తే వ్యక్తి శరీర ఆకృతిపై ఎన్ని జోక్స్ దర్శనమిస్తాయో చెప్పనక్కర్లేదు. సినిమాల్లో సైతం బాడీ షేమింగ్ చాలా ఎక్కువగా కనిపిస్తుంటుంది. మనిషి రంగు నుంచి లావు, సన్నగా ఉండటం.. ముక్కు వంకర, మూతి వంకర అంటూ హేళన చేస్తుంటారు. అవి ఎదుర్కొన్న వారికే దాని తాలూకు బాధ ఏ స్థాయిలో ఉంటుందో తెలుస్తుంది. తాజాగా ఒక ఘటనను పరిశీలిస్తే.. కాదెవరూ బాడీ షేమింగ్‌కు అనర్హం అని అనిపిస్తోంది.

#### అగ్గిలా మారి వణికిస్తా..

తాజాగా సాక్ష్యాత్తు తెలంగాణ గవర్నర్ తమిళి సై తనను బాడీ షేమింగ్ విమర్శలను ఎదుర్కొంటున్నానని చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగించింది. కానీ ఆమె కాన్ఫిడెన్స్ ముందు బాడీ షేమింగ్ విమర్శలన్నీ మట్టిలో కలిసిపోయాయి. “నా శరీర రంగు గురించి కొందరు అదే పనిగా విమర్శలు చేస్తున్నారు. నేను నల్లగా ఉన్నానని అంటున్న ప్రత్యర్థులను అగ్గిలా మారి వణికిస్తా” అని గవర్నర్ తమిళిసై హెచ్చరించారు. శనివారం తమిళిసై చెన్నై తండయార్‌పేటలోని బాలికల ప్రైవేటు పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా




హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన రంగు.. నుదుటిని సైతం హేళన చేస్తు?న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను నలుపు అంటే అగ్గిలా మారుతానని, బట్టతల ఉన్న వ్యక్తి అంటూ విమర్శించేవారు.. ఓర్వలేనంతగా ఉన్నత స్థాయికి చేరతానని వ్యాఖ్యానించారు.

#### స్టార్ హీరోయిన్ సాయి పల్లవి సైతం..

నిజానికి గవర్నర్ తమిళ్ సైకి బాడీ షేమింగ్ విమర్శలు కొత్తేమీ కాదు. గతంలో కూడా ఆమెను దిష్టిబొమ్మగా చూపిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు వెలిశాయి. దీనిపై నెటిజన్లు పెద్ద ఎత్తున మండిపడ్డారు. కొందరు హీరోయిన్లకు కూడా బాడీ షేమింగ్ విమర్శలు ఎదురవుతూనే ఉన్నాయి. సినిమాల్లోనూ బాడీ షేమింగ్ ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. సైడ్ క్యారెక్టర్స్ పరిస్థితి అయితే చెప్పనక్కర్లేదు. 'శ్యామ్ సింగరాయ్ మూవీ సమయంలో స్టార్ హీరోయిన్ సాయిపల్లవి సైతం బాడీ షేమింగ్‌ను ఎదుర్కొంది. దేవదాసి పాత్రలో సాయి పల్లవి అందంగా లేదంటూ తమిళనాట ఏకంగా ఒక వార్త ప్రచురితమవడం గమనార్హం. దీనిపై నెటిజన్లే కాదు.. తమిళిసై కూడా స్పందించారు. పొట్టిగా, నల్లగా, తనలా రింగుల జుట్టుతో పుట్టడమనేది మన చేతుల్లో లేదన్నారు. కేవలం మహిళలే బాడీ షేమింగ్‌కు గురవుతారని కానీ పురుషులకు అలాంటి పరిస్థితులు ఎదురు పడవన్నారు. 50 ఏళ్ల వయసులో ఉన్న పురుషులను కూడా యువకులుగానే చూస్తారని. కానీ స్త్రీలను మాత్రం అలా ఎన్నటికీ చూడరన్నారు.

#### సామాన్య మహిళల పరిస్థితేంటి?

గవర్నర్ అంతటి వారిపైనే బాడీ షేమింగ్ విమర్శలు వస్తుంటే.. సామాన్య మహిళల పరిస్థితేంటి? నిత్యం ఎక్కడ పడితే అక్కడ.. దారుణాతి దారుణంగా బాడీ షేమింగ్ విమర్శలను ఎదుర్కుంటూనే ఉంటారు. అయినా సరే.. పట్టించుకునే ప్రభుత్వాలేవి? పోలీసులేరి? చట్టం తన పని తాను చేసుకుపోతుందని పోలీసులు.. షీ టీమ్స్ ఏర్పాటు చేశామని ప్రభుత్వం చేతులు దులిపేసుకుంటున్నాయి. ఇక ఈ విషయాలను ఎవరికీ చెప్పుకోలేక తమలో తామే కొందరు మహిళలు కుమిలిపోతున్నారు. సొంత ఇంట్లో సైతం ఈ విమర్శలు ఎదుర్కొనే మహిళలు లేకపోలేదు. అయితే ఇది కొందరిని మానసికంగా దెబ్బ తీస్తే.. మరికొందరు మరింత ధృఢంగా మారి ఎదురయ్యే అవమానాలను తమ ఎదుగుదలకు వినియోగించుకుంటారు. విమర్శలేవైనా సున్నితంగా ఉండాలే కానీ హద్దు దాటితే ఇబ్బందికరమే. ఎదిగే క్రమంలో తగిలే రాళ్లు అన్నీ ఇన్నీ కావు. వాటన్నింటినీ పునాది చేసుకుని ఎదిగితే మంచి స్థాయిలో ఉంటాం. లేదని కృంగిపోతే మనతో పాటు జీవితమూ అక్కడే ఆగిపోతుంది.

# భూకంప మృతుల సంఖ్య 33 వేలు

**సిరియా :**

టర్కీ, సిరియా ప్రాంతాల్లో గత సోమవారం తెల్లవారుజామున భారీ భూకంప సంభవించిన సంగతి తెల్సిందే. వరుస భూకంపాలతో సిరియా.. తుర్కియే ప్రాంతాల్లో భారీ భవంతులు నేలకూలాయి. ఈ భారీ దుర్ఘటనలో 2వేల మంది అదే రోజు మృత్యువాతపడగా అనేక మంది గాయాల పడ్డారు. అయితే శిథిలాల కింద వేలాదిమంది చిక్కుకుపోవడంతో సహాయ బృందాలు వారికి బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో భూకంపం సంభవించి వారం రోజులు గడుస్తోంది. ఈ నేపథ్యంలోనే మృతుల సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతూ వచ్చింది. తాజా సమాచారం మేరకు భూకంప మృతుల సంఖ్య 33 వేల 179 మంది మరణించగా సుమారు 92 వేల మంది క్షతగాత్రులుగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే వారం రోజులు గడిచి పోవడంతో శిథిలాల కింద ఇరుక్కున్న వారు ప్రాణాలతో బయట పడే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.ఈ నేపథ్యంలో భూకంప మృతుల సంఖ్య 50 వేలకు పైగా చేరే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా శిథిలాల కింద ఇరుక్కుపోయిన వారి ఆర్తనాదాలతో ఆయా ప్రాంతాలు హృదయ విదారకంగా మారాయి. సహాయక బృందాలు శిథిలాలను తొలగిస్తున్న క్రమంలో కొందరు మృత్యుంజయులుగా తిరిగొస్తున్నారు.ఈ క్రమంలోనే 101 గంటలకు శిథిలాల కింద చిక్కుకున్న అద్నాన్ మహమ్మద్ అనే వ్యక్తి 17 ఏళ్ల యువకుడు దాహర్తి తాళలేక తన మూత్రనే తాగి ప్రాణాలతో బయటపడ్డాడు. అలాగే అదియామన్ అనే చోట నాలుగేళ్ల చిన్నారి 105 గంటలపాటు శిథిలాల కింద ఇరుక్కుపోయి ప్రాణాలతో బయట పడింది. కిరిఖాన్లో 50 గంటల తర్వాత ఓ మహిళను జర్మనీ బృందం కాపాడింది.మరోచోట శిథిలాల కింద ఇరుక్కున్న 20 ఏళ్ల విద్యార్థిని వాట్సాప్ కాపాడింది. అలాగే ఓ చోట తల్లి బొడ్డు ఊడకుండా పుట్టిన ఓ చిన్నారిని సహాయ బృందం రక్షించింది. కిర్ ఖాన్ నగరంలో 88 ఏళ్లను బామ్మను తాజాగా తుర్కిష్.. జర్మనీ బృందాలు కాపాడాయి. ఇక భూకంప సమయంలో ఇద్దరు నర్సులు తమ ప్రాణాలకు తెగించి నవజాత శిశువులను కాపాడిన వీడియో తాజాగా నెట్టింట్లో వైరల్ గా మారింది.మరోవైపు భూకంప ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు చేసిన 130 మంది గుత్తేదారులపై అధికారులు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. వీరిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కాగా భూకంప పరిస్థితిని ఆసరా చేసుకుని కొందరు దోపిడీలకు పాల్పడుతుండటంతో ముఠాలను కట్టడి చేయాలని ప్రభుత్వం పోలీసులను ఆదేశించింది.

# దేశ ఆర్థిక పరిస్థితి పై అవగాహన లేని ముఖ్యమంత్రి కేసీఆర్

**న్యూఢిల్లీ :**

దేశ ఆర్థిక పరిస్థితి పై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారిందంటూ తప్పుడు సంకేతాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో దేశ ఆర్థిక పరిస్థితిపై కేసీఆర్ కు కేంద్రమంత్రి సవాలు విసిరారు. “దేశ ఆర్థిక వ్యవస్థను బంగ్లాదేశ్, శ్రీలంక, తదితర దేశాలతో పోల్చారు. దీనిపై కేసీఆర్‌తో చర్చకు సిద్ధం. ప్రెస్‌క్లబ్, గన్‌పార్క్, ప్రగతి భవన్, ఫార్మ్‌హౌస్‌లో ఎక్కడ చర్చకు వస్తారు. రాజీనామా పేపర్ జేబులో పెట్టుకుని వస్తారా. చర్చలో కల్వకుంట్ల కుటుంబం భాష కాకుండా తెలంగాణ భాష మాత్రమే మాట్లాడాలి” అంటూ కిషన్ రెడ్డి సవాల్ చేశారు. అసెంబ్లీ వేదికగా కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. దేశ ఆర్థిక స్థితి గురించి మాట్లాడిన కేసీఆర్.. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై మాత్రం పెదవి విప్పలేదన్నారు. ఇవి తెలంగాణ బడ్జెట్ సమావేశాలా లేక... మోదీ వ్యతిరేక సమావేశాలా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై అసెంబ్లీలో ఎందుకు చర్చించలేదని నిలదీశారు. రాష్ట్రంలోని వైఫల్యాలపై మాట్లాడని కేసీఆర్.. కేంద్ర ప్రభుత్వంపై



ఆధారాలేని విమర్శలు చేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తెలంగాణ బీజేపీ బలపడుతుందని.. బడ్జెట్ మీటింగ్‌ను రాజకీయ సమావేశాలుగా మార్చుకున్నారని కేంద్రమంత్రి విరుచుకుపడ్డారు.

#### కేసీఆర్.. తోడా సబర్ కరో...

సభలో చెప్పిన తిరుమలరాయుని పిట్ట కథ కేవలం కేసీఆర్‌కే వర్తిస్తుందన్నారు. రాజీనామాకు సిద్ధమని కేసీఆర్ అంటున్నారని... కేసీఆర్ రాజీనామాకు తొందర ఎందుకని ప్రశ్నించారు. “రాజీనామా పేపరు జేబులో పెట్టుకొని తిరుగుతారంట. అయ్యా కేసీఆర్.. తోడా సబర్ కరో.. ఇంకా ఎనిమిది నెలలు ఉన్నాయి. ఇంతముందే రాజీనామా పేపరు ఎందుకు పెట్టుకున్నరు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజ్‌భవన్‌లో రాజీనామా లేఖ ఇవ్వక తప్పదని” యెద్దేవా చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చే నాటి రూ.60వేల కోట్లతో అప్పున్న తెలంగాణ రాష్ట్రం.. నేడు రూ.5లక్షల కోట్ల అప్పు దాటిందన్నారు. అప్పులు చేసి కమిషన్లు కొట్టే ప్రభుత్వం తమది కాదాన్నరు. ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగోతందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.

## ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను సీబీఐ అరెస్టు చేసే అవకాశం?

**న్యూ ఢిల్లీ**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సిబిఐ దుఉకుడు పెంచింది. లిక్కర్ స్కాంపై గతంలో దాఖలు చేసిన చార్జిషీట్లలోనూ ఎమ్మెల్సీ కవిత పేరును ప్రస్తావించడం ఇక్కడ గమనార్హం. ఈ నేపథ్యంలోనే కవిత అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తాజా పరిణామాల నేపథ్యంలో కవితకు త్వరలోనే మరోసారి నోటీసులిచ్చే అవకాశాలు ఉన్నాయని దర్యాప్తు సంస్థల వర్గాలు పేర్కొంటున్నాయి. ఈసారి నోటీసులు జారీ చేసి నేరుగా ఢిల్లీకి పిలిపించి ప్రశ్నించనున్నట్లు చెబుతున్నాయి. గతంలో ఇచ్చిన సమాచారం, ఆ తర్వాత జరిగిన అరెస్టులు, దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు కవితను ప్రశ్నించనున్నట్లు పేర్కొంటున్నాయి. విచారణ అనంతర పరిణామాల నేపథ్యంలో.. తదుపరి చర్యల్లో భాగంగా కవితను సీబీఐ అరెస్టు చేసే అవకాశం లేకపోలేదని విశ్లేషిస్తున్నాయి. లిక్కర్ స్కాం కేసులో వరుస పరిణామాలు కవితకు ఇబ్బందికరంగా మారాయని రాజకీయ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. ఆదివారం శాసన మండలిలో కవితను ఆమె సోదరుడు, మంత్రి కేటీఆర్ కలిశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్సీ ఆందోళనతో కనిపించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ట్రీపుల్ ఐటీలో విషాదం

**కడప**

ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రాయచోటికి చెందిన ఎం. అఖిల ఫైనల్ ఇయర్ రూమ్ లో ఉన్న కిటికికీ ఉరివేసు కొని ఆత్మహత్య చేసుకుంది. ఘటన స్థలాన్ని వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ఎస్సై రంగారావు, వేంపల్లి ఎస్సై తిరుపాల్ నాయక్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి పరిశీలించారు.. మృతికి గల కారణాలపై తోటి విద్యార్థులను అడిగి పోలీసులు తెలుసుకుంటున్నారు.. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం..

**న్యూఢిల్లీ :**

దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఢిల్లీలోని కరంపురాలోని మోతీ నగర్ పోలీస్ స్టేషన్ సమీపంలోని కర్మాగారంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించినట్లు అధికారులు తెలిపారు. 27 అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక చర్యలు చేపడుతున్నాయి. తెల్లవారుజామున ఢిల్లీలోని కరోల్ బాగ్ ప్రాంతంలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే 16 ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఈ ఘటనలో ఎలాంటిప్రాణనష్టం జరగలేదు.

## ఈజీమనీ కోసం చేతివాటం

**కర్నూలు**

ఈజీమనీకి అలవాటుపడుతోంది యువత. ఎంత నిఘా వున్నా తమ పని కానిచ్చేస్తున్నారు. తాజాగా నంద్యాలతో ఓ కేటుగాడు జ్యూయలరీ షాప్ సిబ్బందినే బురిడీ కొట్టించాడు. సీసీ కెమెరాల నిఘా , సెక్యూరిటీ గార్డుల బందోబస్తు , సిబ్బంది అప్రమత్తతతో వుండే చందన బ్రదర్స్ షోరూమ్ లో చేతివాటం ప్రదర్శించాడు ఓ కేటుగాడు. దొరలా వెళ్లి సిబ్బంది కళ్ళు గప్పి, రూ.2 లక్షల విలువైన గోల్డ్ ఛైన్ కాజేసి , తీరిగ్గా కాఫీ తాగి దర్జాగా వెళ్ళిపోయాడు. చోరీ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకుని షాక్ కు గురైన సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. నంద్యాలలోని చందన బ్రదర్స్ షోరూంలో బిజినెస్ పలచగా వుంది. సిబ్బంది భోజనం చేసి, రిలాక్స్ గా వుండే మధ్యాహ్నం సమయంలో షోరూంలో కాలు పెట్టాడు కేటుగాడు. గోల్డ్ సేల్స్ కౌంటర్ వద్దకు వెళ్లి , చైన్ల మోడల్స్ చూడటం మొదలు పెట్టాడు. సేల్స్ మెన్ శివకుమార్ కొన్ని మోడల్స్ చూపించాడు. శివకుమార్ ఏమరుపాటుగా వున్న సమయంలో తాను తెచ్చుకున్న నకిలీ ఛైన్ ను పెట్టి, గోల్డ్ చైన్ ను కాజేసి ,.తనకు నచ్చిన మాడల్స్ లేవని చెప్పి జారుకున్నాడు కేటుగాడు. ఐతే గోల్డ్ చైన్ల సంఖ్య కరెక్ట్ గా వున్న నాణ్యతలో తేడా రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు శివకుమార్. రూ 2 లక్షల విలువైన 34.గ్రాముల గోల్డ్ ఛైన్ ను కాజేసాడు కేటుగాడు. సీసీ టీవీ పుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టారు టూ టౌన్ పోలీసులు. చుట్టూ సి.సి.కెమెరాలు , భద్రత వున్న చందన బ్రదర్స్ షో రూంలో చోరీ జరిగిన తీరుపై ఆశ్చర్యపోతున్నారు పోలీసులు. రికార్డుల్లో వున్న ఫోటోలను పరిశీలించగా , నిందితుడు స్థానికేతరుడని తేలింది. దీంతో అతని కోసం గాలిస్తున్నారు పోలీసులు.

## మున్సిపల్ స్పందనకు ఒకే ఒక్క అర్జీ

**నంద్యాల**

వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందన ద్వారా ప్రజల నుంచి అందే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ తెలిపారు . పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణంలో ఉన్న ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన వినతులు స్వీకరించేందుకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఉన్నామని చెప్పారు. పింఛను కొరకు 1.ఆర్జీ మాత్రమే వచ్చినదని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ తెలిపారు.

# భయపెడుతున్న లేఆఫ్ లు

**ముంబై :**

ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీలన్నీ లేఆఫ్‌లు కొనసాగిస్తున్నాయి. కొన్ని సంస్థలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. మెటాతో మొదలైన ఈ ట్రెండ్...అన్ని కంపెనీలకు విస్తరించింది. ఇప్పుడు మరోసారి మెటా కంపెనీ లేఆఫ్‌లు చేయనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. మరి కొద్ది రోజుల్లోనే భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించనున్నట్టు తెలుస్తోంది. ఈతినిజీనిఇతిజీశ్రీ ౧తిఎవబ రిపోర్ట్ ప్రకారం ఫేస్‌బుక్ పేరెంట్ కంపెనీ మెటా పలు టీమ్‌లకు అవసరమైన బడ్జెట్‌ను రిలీజ్ చేయలేదు. అంటే.. .ఇన్‌డైరెక్ట్‌గా లేఆఫ్‌లు ప్రకటిస్తున్నట్టు సంకేతాలిచ్చింది. ఉద్యోగులను తొలగించిన తరవాతే బడ్జెట్‌లు విడుదల చేయాలని భావిస్తోంది యాజమాన్యం. ఇప్పటికే ఉద్యోగుల్లో లేఆఫ్‌ల భయం మొదలైంది. ఎప్పుడు ఎవరికి పింక్ స్లిప్ ఇస్తారో అని కంగారు పడిపోతున్నారు. గతేడాది నవంబర్‌లో ఒకేసారి 11 వేల మందిని తొలగిస్తున్నట్టు ప్రకటించడం సంచలనమైంది. ఆ కంపెనీలోని మొత్తం ఉద్యోగుల్లో ఇది 13%. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో మొత్తంగా కలిపి 11 వేల మందిని ఇంటికి పంపింది మెటా. ఇటీవలే జుకర్ బర్గ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది తమకు ఎంతో కీలకమని చెప్పారు. మార్కెట్‌కు అనుగుణంగా నడుచుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. అప్పుడే మళ్లీ లేఆఫ్‌లు ఉంటాయా అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు మరోసారి ఆ వార్తలు రావడం వల్ల దాదాపు ఖరారైనట్టే చెబుతున్నాయి కొన్ని రిపోర్ట్‌లు. అటు యాహూ కూడా లేఆఫ్‌లు మొదలు పెట్టింది. ఇప్పటికే 1600 మందిని తొలగించింది. మొత్తం వర్క్‌ఫోర్స్‌లో ఇది 20%. అంతకు ముందు ఎంటర్‌టైన్‌మెంట్ కంపనీ డిస్నీ కూడా 7 వేల మందిని తొలగించింది. కంపెనీ నష్టాల్లో ఉందని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని డిస్నీ సీఈవో బాబ్ ఇగర్ వెల్లడించారు. 2022 డిసెంబర్‌లో సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఐగర్‌కు చాలా సవాళ్లు ఎదురవుతున్నాయి. ఆయన వచ్చీరాగానే భూవివాదం చుట్టు ముట్టింది. ఇప్పటి వరకు డిస్నీ నియంత్రణలో ఉన్న వాల్ట్ డిస్నీ వరల్డ్ చుట్టుపక్కల ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలనుకున్నారు ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్. అంతే కాదు నెట్‌ఫ్లిక్స్ డిసెంబర్‌లో తన వినియోగదారుల సంఖ్యను భారీగా పెంచుకుంది. అదే టైంలో డిస్నీ+కు సబ్‌స్క్రైబర్స్ తగ్గుతూ వస్తున్నారు. ఇది కూడా ఆయన ఎదుర్కొంటున్న పెద్ద సవాల్. ఖర్చులను నియంత్రించే ప్రయత్నంలో భాగంగా సబ్‌స్క్రైబర్లను పెంచుకునేందుకు నెట్‌ఫ్లిక్స్ పాస్వర్డ్ షేరింగ్ ఆప్షన్‌ను నిలిఎ వేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఆర్థిక మాంద్యం కారణంగా అనేక పెద్ద కంపెనీలు లేఆఫ్స్ ఇస్తున్నాయి. గూగుల్ దాదాపు 12 వేల మందిని విధుల నుంచి తొలగించింది. గూగుల్‌తోపాటు మెటా (ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్), అమెజాన్, మైక్రోసాఫ్ట్, శాప్, ఓఎల్‌ఎక్స్, మరికొన్ని పెద్ద కంపెనీలు తమ సిబ్బందిని పెద్ద ఎత్తున తొలగించాయి. అటు అమెజాన్‌లోనూ మరోసారి పెద్ద ఎత్తున లేఆఫ్‌లు ఉంటాయని తెలుస్తోంది. కాస్ట్ కట్టింగ్‌లో భాగంగా పలు డిపార్ట్ మెంట్‌లలోని ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి బడా కంపెనీలు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యమూ ఇందుకు కారణమవుతోంది.

# ఏపీలో ఆగని గంజాయి దందా


**విశాఖపట్టణం :**

ఏపీలో నిత్యం ఏదో చోట గంజాయి పట్టుబడుతుంది. పోలీసుల కళ్లుగప్పి గంజాయి తరలిస్తున్నారు కేటుగాళ్లు. తాజాగా విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో గంజాయి గుప్పుమంది. ఆంధ్ర యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డులు గంజాయి విక్రయిస్తున్నారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి, నిందితులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆంధ్ర వర్సిటీ సెక్యూరిటీ ఆఫీసర్ కారు డ్రైవర్ ఈ ఉదాంతంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. పోలీసులు ఇప్పటికే నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. ఈ దాడుల్లో రెండు వాహనాలను సీజ్ చేశారు. గంజాయి విక్రయిస్తున్న ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు పోలీసులు. ఏకంగా ఏయూలో గంజాయి పట్టుబడడంతో తీవ్ర కలకలం రేగింది. ఏకంగా సెక్యూరిటీ గార్డులు గంజాయి విక్రయిస్తుండడంతో సంచలనం అయింది. అయితే ఇప్పుడు సెక్యూరిటీ గార్డులు గంజాయి ఎవరికి విక్రయించారో విచారణ చేపట్టారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విశాఖ నగరంలో గంజాయి అక్రమ రవాణాపై సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. వరుసగా దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు బృందాలుగా ఏర్పడిన సెబ్ పోలీసులు వేపగుంట జంక్షన్ నుంచి హనుమంత వాక వరకు సినీ ఫక్కీలో ఛేజింగ్ చేసి 150 కేజీల గంజాయి, గంజాయి తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. నగరంలోకి భారీగా సరఫరా అవుతుందని సమాచారం రావటంతో అధికారులు వేపగుంట జంక్షన్ వద్ద రూట్ వాచ్ నిర్వహించారు. అధికారులను గమనించిన స్మగ్లర్లు కార్ ను అడవివరం జంక్షన్ మీదుగా హనుమంతవాకకు మళ్లించారు. మరో సెబ్ అధికారుల బృందం హనుమంత వాక వద్ద కాపు కాయడంతో గంజాయితో సహా కారును వదిలేసి నిందితుడు పరారయ్యాడు. సంఘటన స్థలానికి చేరుకున్న విశాఖపట్నం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు కారును గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన నిందితులను గుర్తించి త్వరలోనే అరెస్టు చేయడం జరుగుతుందని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణా అడ్డుకోవడంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని సెబ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని వైజాగ్ నుంచి తెలంగాణ హైదరాబాద్ కు గంజాయిని తరలిస్తుండగా ఓ వ్యక్తిని బాచుపల్లి పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 41 కిలోల గంజాయి, ఫోన్, కియా కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ చింతల్ కు చెందిన శివరాత్రి నరేందర్ వైజాగ్ నుంచి హైదరాబాద్ కు గంజాయి తరలిస్తున్నాడు. పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్సీఆర్ కాలనీ వద్ద పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. 41 కిలోల గంజాయి సెల్ఫోన్ కియా కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# పంచాయితీకి 11 కోట్ల కరెంట్ బిల్లు

**నిజామాబాద్ :**

సాధారణంగా కరెంట్ బిల్లు వచ్చే సమయంలో గత నెల అంత వస్తే చాలు, యూనిట్లు పెరిగి ఎక్కువ బిల్లు వస్తే జేబుకు చిల్లు అని అనుకుంటాం. కానీ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఓ గ్రామ పంచాయతీ ఆఫీసుకు ఏకంగా రూ.11.41 కోట్ల కరెంట్ బిల్లు రావడంతో షాకవడం ఉద్యోగులు, సర్పంచి, కార్యదర్శి వంతయింది. ఆ వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండలంంలో కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఉంది. ఆ పంచాయతీ కార్యాలయానికి ప్రతినెల తరహాలోనే జనవరి నెల కరెంట్ బిల్లు వచ్చింది. కానీ ఆ బిల్లు చూసిన సర్పంచ్, కార్యదర్శికి మాత్రం గుండె ఆగినంత పనైంది. ఎందుకంటే కొత్తపల్లి గ్రామ పంచాయతీకి జనవరి నెలకుగానూ రూ.11,41, 63,672 (11 కోట్ల 41 లక్షల 63 వేల 6 వందల 72 రూపాయలు) విద్యుత్ బిల్లు వేశారు. వందలు, వేలల్లో రావాల్సిన కరెంట్ బిల్లు కోట్ల రూపాయల్లో రావడంతో గ్రామానికే షాక్ కొట్టినట్లు అయింది. వామ్మో ఇదేంది.. ఈ రేంజ్ లో కరెంట్ బిల్లులు వసూలు చేస్తున్నారా అంటూ గ్రామస్తులు షాక్ అయ్యారు. వందలు, వేల రూపాయల్లో రావాల్సిన



కరెంట్ బిల్లు రికార్డు స్థాయిలో కోట్ల రూపాయల్లో పంచాయతీ ఆఫీసుకు జనవరి నెల కరెంట్ బిల్లు రావడంతో విద్యుత్ అధికారులను పంచాయతీ పాలక వర్గం, కార్యదర్శి, సర్పంచి నిలదీశారు. గ్రామాన్ని డెవలప్ చేయడానికి నిధులు లేక మేం సతమతం అవుతుంటే, ఎనర్జీ ఛార్జీలు 11 కోట్ల రూపాయలు వేశారని, ఇతరత్రా ఛార్జీలు కలిపితే మొత్తం రూ.11.41 కోట్ల బిల్లు వచ్చిందని మాచారెడ్డి ఏఈ వెంకటరమణను వివరణ కోరారు. సాంకేతిక సమస్య కారణంగా బిల్లు కోట్ల రూపాయల్లో వచ్చిందని, మీటర్ రీడింగ్ చెక్ చేసి బిల్లును పునరుద్ధరిస్తామని ఏఈ చెప్పడంతో గ్రామ సర్పంచ్, కార్యదర్శి ఊపిరి పీల్చుకున్నారు. కానీ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భారీ బిల్లులు వస్తున్నాయని, బిల్లు చూసి ఎవరికైనా అకస్మాత్తుగా ఏమైనా జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని సంబంధిత శాఖ ఉన్నతాధికారులను గ్రామస్తులు, అధికారులు ప్రశ్నిస్తున్నారు. కాకా హోటల్ కు కోట్ల రూపాయల కరెంట్ బిల్లు వచ్చిన ఘటన పశ్చిమగోదావరి జిల్లాలో గతంలో చోటుచేసుకుంది. బిల్లు చూసి నిర్వాహకులు షాక్ తిన్నారు. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి కొత్త బస్టాండు సమీపంలో ఉన్న చిన్నపాటి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు ముళ్లగిరి మంగమ్మ. సెప్టెంబర్ నెలకు సంబంధించి రూ.కోట్లలో విద్యుత్తు బిల్లు రావడంతో ఆమె అధికారులకు ఫిర్యాదుచేశారు. సాధారణంగా ప్రతి నెలా రూ.700 వరకు బిల్లు వస్తుండేది. కానీ గత రెండు నెలలుగా వేల రూపాయల్లో బిల్లు వస్తుంది. ఆగస్టులో రూ.47,148 బిల్లు రావడంతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. మీటరులో లోపం ఉందంటూ విద్యుత్తు సిబ్బంది కొత్త మీటర్ బిగించారు. ఈసారి ఏకంగా కోట్లలో బిల్లు వచ్చింది. సెప్టెంబరులో రూ.21,48,62,224 బిల్లు రావడంతో మంగమ్మ మళ్లీ అధికారులకు మొరపెట్టుకున్నారు. సాంకేతిక లోపంతో ఇంత బిల్లు వచ్చి ఉంటుందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యుత్ అధికారులు తెలిపారు.

## గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయాలి

**అల్లవరం**

డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో గల గోడి గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయాలంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు,టీడీపీ నేతలు ఆందోళనకు దిగారు. తక్షణం గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వసతులు సరిగ్గా లేకనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు అంటూ ఆరోపించారు. త్రాగడానికి, స్నానం చేయడానికి కనీసం నీరు కూడా లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మీరు బాగుచేయండి లేకపోతే మేము బాగు చేస్తాం అంటూ నినాదాలు చేశారు. నాడు నేడు అంటే కొద్దీ మంది ఉన్న స్కూల్స్ బాగు చేయడం కాదు అని ఎద్దేవ చేశారు. వందల మంది ఎస్సీ పేద విద్యార్థులు చదువుతున్న గురుకుల పాఠశాలను తక్షణమే అభివృద్ధి చేయాలంటూ టీడీపీ నేతలు ఆందోళనకు దిగారు.

## చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి

**పిఠాపురం**

కేంద్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాకినాడ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ పిలుపునిచ్చారు.... పిఠాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి మాజీ ఎమ్మెల్యే వర్మ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన పెద్దాపురం నియోజకవర్గంలో జరగబోవు చంద్రబాబు నాయుడు పర్యటనకు భారీ ఎత్తున పిఠాపురం నియోజకవర్గం నుండి తరలి వెళ్లడం జరుగుతుందని అదేవిధంగా మాజీ మంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసును సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ నీరు కారుస్తున్నాడని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు.

## టర్కీ బాధితులకు రిలీఫ్ మెటీరియల్

**విశాఖపట్నం**

భూకంపం ప్రకృతి ప్రళయంతో సర్వం కోల్పోయిన భాదితులను ఆదుకు నేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. విశాఖ జిల్లా గాజువాక ఆల్ ముస్లిం ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆపన్న హస్తాన్ని స్ఫూర్తిగా తీసుకొని స్థానిక గాజువాక అజీమాబాద్ దీనియత్ ట్యూషన్ సెంటర్ నిర్వాహకులు ముందుకు వచ్చారు. దాదాపు రెండు టన్నుల రిలీఫ్ మెటీరియల్ తో పాటు 1,80,000/- రూపాయల ఆర్థిక సహాన్ని అందచేసారు.

## వాసిరెడ్డి పద్మను అడ్డుకున్న తెలుగు మహిళలు

**విజయవాడ**

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ సోమవారం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. తాడేపల్లిలో హత్యలకు గురయిన రాణి తల్లి, పెద్దమ్మలను పరామర్శించారు. జరిగిన ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న తాడేపల్లి కు చెందిన టిడిపి మహిళలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. వాళ్లరు దాటుకుంటు వాసిరెడ్డి పద్మ మార్చురీ గదిలోకి వెళ్లిపోయారు. తెలుగు మహిళలు ఛైర్ పర్సన్ కారుకి అడ్డంగా బైటాయించారుర. మహిళల పై జరుగుతున్న దాడులపై పద్మ స్పందించాలని తెలుగు మహిళలు డిమాండ్ చేసారు. ఆందోళన చేస్తున్న మహిళల ను పోలీసులు అరెస్టు చేసారు.

## సిక్కింలోని యుక్సోమ్‌కు వాయువ్యంగా భూకంపం

**సిక్కిం**



సిక్కింలో సోమవారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. సిక్కిం లోని యుక్సోమ్‌కు వాయువ్యంగా 70 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో సోమవారం తెల్లవారు జామున 4.15 గంటలకు భూకంపం సంభవించింది. యుక్సోమ్ పట్టణంలో సోమవారం తెల్లవారుజామున రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. ఈ భూ ప్రకంపనలతో ఇళ్లలో నిద్రపోతున్న జనం లేచి రోడ్లపైకి పరుగులు తీశారు. ఆదివారం అసోంలోనూ భూమి కంపించింది. ఇటీవల టర్కీ, సిరియా దేశాల్లో సంభవించిన భారీ భూకంపం వల్ల వేలాదిమంది మరణించిన నేపథ్యంలో భారతదేశంలోని సిక్కిం, అసోంలలో భూప్రకంపనలు సంభవించినపుడు జనం తీవ్ర భయాందోళనలు చెందారు. అసోంలో సంభవించిన భూకంపం ఘటన జరిగిన మరునాడే సిక్కింను భూప్రకంపనలు వణికించడంతో ఇక్కడి ప్రజలు తీవ్ర కలవరపడ్డారు. భూమి కంపించినపుడల్లా ప్రజలు టర్కీ, సిరియా భూకంప విపత్తును గుర్తు చేసుకొని వణుకుతున్నారు.

# ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

**దేవరకొండ**

నల్గోండ జిల్లా పిఏపల్లి మండలం కోదండపురంలో వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా కల్యాణోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే,బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. గత ఎనిమిది సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వంలో ప్రజలు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందిస్తుంది అని,ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉన్నారని వారు అన్నారు. ఈసారి కూడా నిర్విఘ్నంగా ప్రభుత్వ పథకాలు అన్ని అంది, ప్రభుత్వ కార్యకలాపాలు ఆటంకాలు లేకుండా కొనసాగాలని మనసారా ఆ భగవంతుని ప్రార్థించునట్లు తెలిపారు. ప్రజలు మంచి ఆరోగ్యంతో ఉండేలా చూడాలని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ గారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖంఅూ చైర్మన్ వేలుగురి వల్లపు రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్,వైస్ ఎంపీపీ అర్వపల్లి నర్సింహా,బిఆర్ఎస్ మండల తోటకురి పరమేష్, రేటినేని ముత్యపు రావు,సర్పంచ్ మైనం రాణి వెంకటయ్య, ఎంపీటీసీ మైనం సంధ్య జనయ్య ,యాదాద్రిన్నా చైర్మన్ ముచ్చర్ల శ్రీకాంత్,శీలం శేఖర్ రెడ్డి,ముచ్చర్ల శ్రీనాద్,బురం గురవయ్య, కదరీ శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# గుప్త నిధుల కోసం బాలుడి బలికి యత్నం

**విజయవాడ :**

ఎన్టీఆర్ జిల్లాలో కలకలం రేగింది. గుప్త నిధుల పేరుతో ఓ బాలుడినే బలి ఇచ్చేందుకు యత్నిస్తున్నారన సమాచారం అందర్నీ భయభ్రాంతులకు గురి చేస్తోంది. మూఢత్వాలతో కొందరు మానవత్వం మరిచిపోయి ప్రవర్తిస్తున్నారన్న టాక్ నడుస్తోంది. కోట్ల విలువైన నిధులు వస్తాయని నమ్మి పాపాలకు పాల్పడుతున్నారని మాట వినిపిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా చౌటపల్లి గ్రామంలో అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేస్తున్నారన్న సమాచారంతో గ్రామస్తులు వణికిపోయారు. ధైర్యం చేసిన కొందరు గ్రామస్థులు తిరువూరు మండలం టేకులపల్లి- చౌటపల్లి గ్రామాల సరిహద్దుల వద్దకు వెళ్లారు. గ్రామస్తులు వెళ్లేసరికి అక్కడ కొంతమంది గుంపుగా నిలబడి ఉన్నారు. వాళ్లను పరిశీలిస్తే... వారితో పూజారులు, ఓ బాలుడు కూడా ఉన్నాడు. అంతేకాదు.. ఆబాలుడి తండ్రి కూడా గుంపులో ఉన్నాడు. ఎందుకు వచ్చారు. ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెప్పారు. బాలుడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. అనుమానం వచ్చిన గ్రామస్థులు పోలీసులకు ఫోన్ చేశారు. బాలుడిని నరబలి ఇచ్చేందుకు తీసుకొచ్చారని... వెంటనే రావాలని సమాచారం అందించారు. ఖాకీలు వచ్చి వారిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. గుప్త నిధుల కోసమే ఎనిమిది మంది సభ్యుల గుంపు వచ్చిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వీళ్లంతా బుగ్గపాడు, తిరువూరు, ఏరుకోపాడు, టేకులపల్లి వాసులని చెబుతున్నారు. మొత్తం 8మంది గుప్తనిధుల ముఠాలో నలుగురు పారిపోయారని తెలిపారు. నలుగురు మాత్రమే తమకు చిక్కారని వారిని పోలీసులకు అప్పగించినట్టు వివరించారు. బాలుడిని అడిగితే ఏవో పూజలు అన్నాడని గ్రామస్థులు తెలిపారు. తన తండ్రే పిలిస్తే తాను అక్కడకు వచ్చానంటూ బాలుడు ఏడుస్తూ చెప్పిన విషయం వీడియోలో ఉంది. తను ఏ తప్పు చేయలేదని బాలుడు వివరించాడు. ఓ కారు మూడు బైక్‌లలో ఈ ముఠా వచ్చినట్టు చెబుతున్నారు గ్రామస్థులు. వాళ్లు అనున్న ప్లాన్ వర్కౌట్ అయితే వెళ్లిపోవడానికి ఆ వెహికల్స్‌ను రెడీ చేసినట్టు చెబుతున్నారు. ఓ దిక్కున కారు, బైక్, మరో మూలన రెండు బైక్స్ ఉంచినట్టు పేర్కొన్నారు. గ్రామస్థులు తమను గమనించారని గ్రహించిన ముఠాలోని నలుగురు సభ్యులు రెండు బైక్స్ వేసుకొని పరారైనట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మంత్రి రోజా నియోజకవర్గంలో లోకేశ్ పాదయాత్ర

**నగరి**

గత 17 రోజులుగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారం మంత్రి రోజా నియోజకవర్గం నగరిలో ప్రవేశించింది. చినరాజకుప్పం వద్ద నగరి నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నగరి నియోజకవర్గ ప్రజలు లోకేశ్ కు ఘనస్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో, నగరి నియోజకవర్గంలో లోకేశ్ పాదయాత్ర చేస్తుండడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో మంది పాదయాత్రలు చేశారు. వారి పాదయాత్రలకు లేని ఇబ్బంది నా పాదయాత్రకే ఎందుకు? పోలీసులు నా గొంతులో సౌండ్ని నొక్కేయలేరు. నా చుట్టూ వేలాది మంది పోలీసులు...పైన డ్రోన్లు... నేనంటే నీకు ఎందుకంత భయం జగన్ రెడ్డీ నీకు?" అని ప్రశ్నించారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, వృద్ధులు అందరూ జగన్ ప్రభుత్వ బాధితులేనని లోకేశ్ విమర్శించారు. "నేను మంత్రిగా ఉన్నప్పుడు తెచ్చిన పరిశ్రమలతో వేలాది ఉద్యోగాలు వచ్చాయి. ఆ పరిశ్రమలని నేడు జగన్ రెడ్డి తరిమేస్తున్నాడు. రాయలసీమలో వేలాది మందికి ఉపాధి కల్పించిన అమర్ రాజాని తరిమేశాడు. జాబు క్యాలెండర్ అని సున్నా చుట్టేశాడు. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి దగా చేశాడు. ఉద్యోగులకు టైముకి జీతాలు లేవు" అంటూ లోకేశ్ ధ్వజమెత్తారు.

# జీపిలకు రావాల్సిన పెండింగ్ నిధులు విడుదల చేయాలి

**చేసిన పనులకు బిల్లులు రాక మానసిక ఆందోళనలో సర్పంచ్ లు**

**సర్పంచ్ ల పరిస్థితులపై మాట్లాడేందుకు సీఎం అనుమతివ్వాలి**

**సీఎం కేసీఆర్ కు బతికేపల్లి సర్పంచ్ శోభారాణి లేఖ**

**జగిత్యాల :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల పట్ల చిన్న చూపు చూస్తున్నాయని, అలాగే గ్రామపంచాయితీలకు ప్రభుత్వాలు నిధుల విడుదలలో జాప్యం చేస్తుండడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని వెంటనే నిధులు విడుదల చేయాలని జగిత్యాల జిల్లా పంచాయితీ రాజ్ ఛాంబర్ అధ్యక్షురాలు, పెగడపల్లి మండలం బతికేపల్లి సర్పంచ్ తాటిపర్తి శోభారాణి ముఖ్యమంత్రి కేసీఆర్ ను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి,నిధుల విడుదల, సర్పంచ్ ల ఆత్మహత్యలు తదితర సమస్యల గురించి చర్చించేందుకు సీఎం కేసీఆర్ సర్పంచులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కోరారు. గ్రామపంచాయతీ సర్పంచ్ లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, వాటిని పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ శోభారాణి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సోమవారం ఒక లేఖ రాశారు. గత ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబందదించి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు పెండింగ్ లో ఉన్నాయని అట్టి నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని లేఖలో కోరారు. గ్రామాల్లో అప్పు చేసి సర్పంచులు అభివృద్ధి పనులు చేస్తే నెలలు గడుస్తున్నా బిల్లులు ( చెక్కులు) ట్రెజరీల్లో పాస్ కాకపోవడంతో మనస్తాపానికి గురై కొందరు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఈ దుస్థితి తెలంగాణలో ఉండడం బాధాకరమన్నారూ. ఇలా జరుగకుండా నిధులు విడుదలచేయాలని, లేనిపక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామని శోభారాణి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నెల నెల నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తుండడం వల్ల గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేసి నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో సర్పంచ్ లు మానసిక ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం 15 వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకపోవడంతో సిబ్బంది జీతాలకు, ట్రాక్టర్ కిస్తులు, ఇతర అవసరాలకు డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విధిలేని పరిస్థితుల్లో సర్పంచులు స్వంతంగా ఖర్చులు పెట్టుకుంటున్నామని, చేసిన పనులకు నెల తరబడి బిల్లులు రాక చేసిన అప్పులు పెరిగి సర్పంచులకు తలకు మించిన భారంగా మారిందని శోభారాణి వాపోయారు. సర్పంచ్ లకు అనుమతులు లేకుండానే కరెంట్ బిల్లులు వసూలు చేస్తున్నట్లుగానే నిధులు సకాలంలో అందివ్వాలన్నారు. జనాభా ప్రాతిపాధికనా గ్రామపంచాయతీలకు నిధులివ్వాలని, కేంద్రం నుండి గ్రామాలకు వచ్చే నిధుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం మాకు తెలుపడంలేదని శోభారాణి వాపోయారు. బిల్లులు రాక, జిపిల్లో నిధులు లేక ప్రజలకు సమాధానం చెప్పుకోలేక సతమతమవుతు కొన్ని చోట్ల సర్పంచ్ లు దినసరి కూలీలుగా మారారని ఇంతకంటే ఘోరం ఏముంటదని శోభారాణి ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు ఇచ్చిన నిధులను దారిమళ్లీస్తూ అభివృద్ధిని అడ్డుకుంటుందని,స్థానిక సంస్థల పట్ల చిన్నచూపు చూస్తూ,నిర్వీర్యం చేస్తున్నాయని శోభారాణి లేఖలో ఆరోపించారు. గతంలో ధర్మపురి పర్యటనలో ప్రతి పంచాయతీకి 10 లక్షలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ జగిత్యాల జిల్లాలోని 380 గ్రామపంచాయతీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక నిధులు విడుదల చేయాలని, ఈవిషయంపై నేడు కొండగట్టుకు వస్తున్న కేసీఆర్ ప్రకటన చేయాలని శోభారాణి డిమాండ్ చేశారు. కేంద్రం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేసి గ్రామాలాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ శోభారాణి సీఎం ను కోరారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చలో ఎస్ బి ఐ బ్యాంక్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**




అశ్వరావుపేట లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చలో ఎస్ బి ఐ బ్యాంక్ ధర్నా నిర్వహించారు. ధర్నా లో సిపిఐ జిల్లా నాయకులు సయ్యద్ సలీం మాట్లాడుతూ ఆదాని స్టాక్స్ కుంభకోణం లో ఆదానిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ జే పి సి వేసి విచారణ జరిపించాలి అన్నారు రైతాంగ వ్యతిరేక కార్పొరేట్ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ను వ్యతిరేకించాలని సూచించారు బ్యాంకులు ఎల్ఐసి సంస్థను ప్రైవేటీకరణను రద్దు చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సెక్రెటరీ గన్నిన రామకృష్ణ రామకృష్ణ జాయింట్ సెక్రెటరీ సయ్యద్ రఫీ సంఘం కృష్ణమూర్తి ఏఐటీయూసీ నాయకులు టి సత్యనారాయణ నాగేంద్రబాబు సజ్జ శ్రీను షేక్ నాగూర్ రాజు ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి షేక్ ఖాసిం మండల మహిళా మండలి కార్యదర్శి చీపుర్ల సత్యవతి షేక్ రిజ్వాన షేక్ మున్ని పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# జలపతి రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాటం

**జగిత్యాల**



ముగ్గురి మృతికి కారకుడైనా వకీల్ దామోదర్ రావును వెంటనే అరెస్ట్ చేయాలని, అలాగే జలపతి రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు నరహరి జగ్గారెడ్డి, జగిత్యాల రెడ్డి జన సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎడమల శైలెందర్ రెడ్డి లు స్పష్టం చేశారు. ప్రభుత్వం సేకరించిన భూమిని కోల్పోయి ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకున్న జగిత్యాల రూరల్ నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు గడ్డం జలపతి రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వారి ఆత్మహత్యకు కారకులైన న్యాయవాది దామోదర్ రావును వెంటనే అరెస్టు చేయాలని రెడ్డి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రెడ్డి వర్గీయులు జగిత్యాలలో ధర్నా నిర్వహించారు. రెడ్డి కల్యాణమండపం నుంచి కలెక్టరేట్ వరకు రెడ్డి వర్గీయులు ర్యాలీ నిర్వహించడమే కాకుండా జయశంకర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసీ, జగిత్యాల బార్ అసోసియేషన్ నుండి దామోదర్ రావును బహిష్కరించాలని కోర్టు వద్దకు చేరుకున్న మృతుడి భార్య, కూతురుతో పాటు రెడ్డిలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముద్దం ప్రభాకర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సేకరించిన భూమికి సంబందించిన పరిహారం డబ్బులు ఇప్పించడంలో వకీల్ దామోదర్ రావు రైతు జలపతి రెడ్డిని ఇబ్బందులకు గురిచేశాడని, ఆయనకు డబ్బులు ఇప్పియ్యకుండా జాప్యం చేయడంతో ఇద్దరు కూతుళ్ళ తో పాటు జలపతి రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని దీనికి వకిలే కారణమని దుయ్యబట్టారు. 11 రోజులైనా దామోదర్ రావును అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం చేయడాన్ని ఆయన తప్పుబాట్టారు. జగిత్యాల డిఎస్పీ రెండు రోజుల్లో అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారని అలా జరుగని పక్షంలో జలపతి రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేవరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సంతోష్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే కొండగట్టులో ఈవిషయమై నిరసన తెలుతామణి చెప్పారు. మృతుల కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం, కూతురు చదువు బాధ్యత, ఇంట్లో ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుడి భార్య కూతురు మాట్లాడుతూ వకీల్ దామోదర్ రావు ను అరెస్ట్ చేయడంతో పాటు మాకు న్యాయం జరుగకపోతే మేము కుడా విషం తాగి ఆత్మహత్య చేసుకుంటామని రోదిస్తూ చెప్పారు. దామోదర్ రావును. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి ముస్కు రాంగోపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, బతికేపల్లీ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, మాజీ ఎంపిపి కాటిపల్లి గంగారెడ్డి, ముదుగంటి రవీందర్ రెడ్డి, గడ్డం భాస్కర్ రెడ్డి, బాలేపల్లి రవీందర్ రెడ్డి, పన్నాల తిరుపతిరెడ్డి, మనోహర్ రెడ్డి,బండ గోపాల్ రెడ్డి, ధారం జగన్నాత రెడ్డి, ఎన్నం నర్సిసీహ్మ రెడ్డి,సుదర్శన్ రెడ్డి, తాటిపర్తి రాజేందర్ రెడ్డి, బోజి రెడ్డి, గోపాల్ రెడ్డి, రమేష్ రెడ్డి, నిశాంత్ రెడ్డి, భూమారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి,వివిధ గ్రామాల నుండి వచ్చిన రెడ్డి వర్గీయులు పాల్గొన్నారు.

# పోడు హక్కు పత్రాలు ఇవ్వాలి

**భద్రాద్రి**

భద్రాద్రి కొత్తగూడెం,ఇప్టూ జిల్లా కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా నాయకుడు కందగట్ల సురేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే ఉమర్ మాట్లాడుతూ కార్పొరేటర్లకు అడవులను దారాదత్తం,చేసే అటవీ హక్కులను నిర్వీర్యం చేసే,అటవీ సంరక్షణ నియమాలు 2022 ఉపసరించాలి. పోడు సాగుదారులందరుకు హక్కు పత్రాలు ఇవ్వాలని అన్నారు.

అటవీ హక్కుల చట్టం 2006 ద్వారా 13-12-2005 వరకు పోడు భూములపై ఆదివాసీలకు చట్టబద్ధహక్కు లభించింది. ఇది,ఎవరి దయాదాక్షణాలపై ఆధారపడిన,అక్కు కాదు చట్టం కేవలం ఆదివాసీలకు షెడ్యూల్డ్ ప్రాంతాలకు మాత్రమే,కాక దేశంలో అన్ని అడవి ప్రాంతాలకు వర్తించటం చట్టం పేరే గిరిజనులు ఇతర హారంపర్య అటవీ నివాసులు గిరిజనేతల చట్టం 2006 చట్టాన్ని తప్పుగా వక్రీకరించి గిరిజన ఇతరులు దరఖాస్తులన్నీటిని చట్ట వ్యతిరేకంగా తిరస్కరించుట జరిగింది. అయితే,గిరిజనేతర్లు అడవి ప్రాంతాల్లో ఒకే చోట కాకపోయినప్పటికీ, 75 సంవత్సరాలుగా, నివాసం ఉండి, ఉండాలి,రాష్ట్రంలోని అడవి ప్రాంతాలలో,ఆ విధంగా 100 సంవత్సరాలకు పైగా ఉంటున్న, గ్రామాలు ప్రతి జిల్లాలోనూ అనేకం ఉన్నాయి. వీరు 75 సంవత్సరాల నుంచి, సాగు చేస్తూ ఉండాలని, .తప్పుగా చట్టాన్ని వక్రీకరించి,వీరి అర్జీలు అన్నిటిని తిరస్కరించటం జరిగింది. దీనిపై కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ అనేకసార్లు వివరణ ఇచ్చింది. 2021 డిసెంబర్లో ఈ శాఖ ఐక్యరాజ్యసమితి అభివృద్ధి పథకంతో కలిసి అటవీ హక్కుల చట్టం అమలుతో తరుచుగా అడిగే ప్రశ్నల పేరిట,అనేక విషయాలపై, ఒక బుల్లెట్ తో వివరణ ఇచ్చింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా,తన ఇష్టారాజ్యంగా అటవీశాఖ అధికారుల ద్వారా వ్యవహరిస్తుంది. అంతేకాక, 11-10-2021న కేసీఆర్ ప్రకటించిన,కార్యచరణ ప్రణాళికలో రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా పోడు సాగుదారులందరకు వన్ టైం సెటిల్మెంటు అక్కుపత్రాలు ఇస్తానని చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరుతున్నాం. పైన పేర్కొన్న చట్ట వ్యతిరేక చర్యలు అన్నిటిని,సవరించి తిరిగి అన్ని అర్జీలను పరిశీలించి,పోడు సాగు దారులందరికి హాక్కుపత్రాలు ఇవ్వాలని కోరుతున్నాం.

వాల్మీకి,బోయ, మధురాలలో వివిధ తరగతులతో పాటు,గొత్తె కోయలను,కూడా షెడ్యూలు తెగలలో చేర్చాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేయాలి. బంజారా లు కొత్తగా, చేరే తెగలు జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచి,చేర్చిన తేదీ, నుండి, దామాషాలో అస్సాం ఫార్ములాను అమలు చేయాలని కోరుతున్నాం. లేని ఎడల రిజర్వేషన్లు సంక్షేమ పథకాలలో ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుంది. ఆడవలను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసే అటవీ హక్కులను ,కాలరాసీ అటవీ సంరక్షణ నియమాలు 2022 ను కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపసంరిచాల్సిందిగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు..

# 14 ఫిబ్రవరి వాలెంటైన్స్ డే ను నిషేధించాలి -శివసేన డిమాండ్

**హైదరాబాద్**

శి
వసేన ఆధ్వర్యంలో కాచిగూడ దగ్గర వాలెంటైన్స్ డే నువ్వు నిషేధించాలని హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని కాచిగూడ లో ఈరోజు కార్యక్రమం చేయడం జరిగింది సేవ్ ఇండియన్ కల్చర్ బైకట్ వాలెంటైన్స్ డే అనే కార్యక్రమం ఈరోజు చేయడం జరిగింది నిజమైన భారతీయులైతే వాలెంటైన్స్ డే ను నిషేధించండి మరియు బహిష్కరించండి భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత ముందుకు రావాలని శివసేన పార్టీ పరంగా పిలుపునివ్వడం జరిగింది భారతదేశానికి సేవ చేయాలి అనుకునేవారు మంచి కార్యక్రమాలను ముందు తీసుకెళ్లాల్సిన అవసరం




ఉంది వాలెంటైన్స్ డే వల్ల యువత చెడు దారి పోయే ప్రమాదం ఉంది ముఖ్యంగా లవ్ జిహాద్ ఎక్కువగా జరుగుతున్నాయి యువతీ యువకులు అప్రమత్తంగా ఉండాలని ఈ వాలెంటైన్స్ డే రూపుమాపాలని యువతకు పిలుపునివ్వడం జరిగింది. ఏ సుదర్శన్ శివసేన్ తెలంగాణ రాష్ట్ర ప్రధన కార్య దర్శి గౌట్ గణేష్ యువ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు కార్యకర్తలు మహేష్ గోపాల్ రాజు భానుచందర్ తిరుపతి మారుతీ శంకర్ సాగర్ జగన్ తదితరులు పాల్గొన్నారు

# మాస్ మహారాజా రవితేజ, 'రావణాసుర' సెకండ్ సింగిల్ ప్యార్ లోన పాగల్ లిరికల్ వీడియో ఫిబ్రవరి 18న విడుదల



వరుస బ్లాక్‌బస్టర్‌లతో ఫుల్ స్వింగ్‌లో వున్న మాస్ మహారాజా రవితేజ, క్రియేటివ్ డైరెక్టర్ సుధీర్ వర్మ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్, ఆర్ టి టీమ్‌వర్క్స్‌పై రూపొందుతున్న ఎంగేజింగ్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర' తో ఈసారి థ్రిల్ చేయడానికి సిద్ధంగా వున్నారు. అభిషేక్ నామా, రవితేజ ఈ చిత్రానికి నిర్మాతలు. రవితేజ పుట్టినరోజున రావణాసుర డిఫరెంట్ షేడ్స్ చూపించే ఒక గ్లింప్స్ విడుదల చేయడం ద్వారా ప్రమోషన్లను ప్రారంభించారు మేకర్స్. ఇటీవల హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరపరిచిన థీమ్ సాంగ్‌ను విడుదల చేయడం ద్వారా మ్యూజిక్ ప్రమోషన్‌లను స్టార్ట్ చేశారు. ఎలక్ట్రిఫైయింగ్, వైబ్రెంట్ ట్రాక్ మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో నిలిచింది.

హర్షవర్ధన్ రామేశ్వర్‌తో పాటు భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ రోజు మేకర్స్ రెండవ సింగిల్ ప్యార్ లోన పాగల్ లిరికల్ వీడియోను ఫిబ్రవరి 18న విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశాడు. షేడ్స్‌తో బ్లాక్ అవుట్ ఫిట్ ధరించిన రవితేజ పోస్టర్‌లో అల్ట్రా-స్టైలిష్‌గా కనిపిస్తు గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్ తో ఆకట్టుకున్నారు.

సుధీర్ వర్మ ఈ సినిమాలో రవితేజను లాయర్ పాత్రలో మునుపెన్నడూ చూడని విధంగా హై యాక్షన్ లో ప్రజంట్ చేస్తున్నారు. శ్రీకాంత్ విస్సా ఈ చిత్రానికి సరికొత్త కథని అందించారు. సుధీర్ వర్మ తన మార్క్ టేకింగ్‌తో ఈ చిత్రాన్ని కథనంలో ఊహించని మలుపులతో స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. సుశాంత్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో అను ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నాగర్కర్, పూజిత పొన్నాడ.. కథానాయికలుగా నటిస్తున్నారు. విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా శ్రీకాంత్ ఎడిటర్ గా పని చేస్తున్నారు.

ఏప్రిల్ 7,2023న రావణాసురు గ్రాండ్‌గా విడుదల కానుంది.

తారాగణం: రవితేజ, సుశాంత్, అను ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నాగర్కర్, పూజిత పొన్నాడ, రావు రమేష్, మురళీ శర్మ, సంపత్ రాజ్, నితిన్ మెహతా (అఖండ ఫేమ్), సత్య, జయ ప్రకాష్ తదితరులు.













Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950